PRGI Reg No -“APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....




ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 104, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 04 - జూన్ - 2026 , వెల రూ.5/-

## 2027 గోదావరి పుష్కరాలు చరిత్రలో నిలిచిపోవాలి: చంద్రబాబు




- 2027 గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి

## తెలంగాణకు వర్ష సూచన.. 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్




- తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన
- 18 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం




మీ కొత్త బాధ్యతను సమర్థంగా నిర్వహించండి”

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ బెంగళూరులోని లోక్ భవన్‌లో కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణ స్వీకారం చేయించారు. మరో 13 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.



## తెలంగాణపై నా నిబద్ధత ఈనాటిది కాదు: పవన్

- 2009లో ప్రజారాజ్యం పార్టీ యువరాజ్యం విభాగానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు.. ఉస్మానియా విద్యార్థి నేతలు, గద్దర్‌తో కలిసి తెలంగాణ సామాజిక న్యాయసభలో పాల్గొన్నా
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు బహిరంగంగా మద్దతు తెలిపా
- నాటి తన నిర్ణయమే తెలంగాణ పట్ల తనకున్న అచంచల నిబద్ధతకు నిదర్శనం




## ఆరోగ్యమే అసలైన సంపద.. జీవనశైలి మార్చుకోవాలి

### అమరావతిని గ్లోబల్ హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటన

గుంటూరులో లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు


- సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ వివరాలు వెల్లడి
- గత ప్రభుత్వంలో నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని విమర్శ
- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు సూచన

అమరావతి: రాజధాని అమరావతిని భవిష్యత్తులో ప్రపంచస్థాయి ఆరోగ్య కేంద్రంగా (గ్లోబల్ హెల్త్ హబ్) తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గతంలో హైదరాబాద్‌లో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించిన మిగతా 2 లో

## గొడ్డలి పార్టీకి విధ్వంసం తప్ప
# ఏమీ చేతకాదు

డీఎస్సీ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని చంద్రబాబు స్పష్టీకరణ

- సీఎం చంద్రబాబు ఫైర్
- పేటీఎం బ్యాచ్‌లతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- యోగాంధ్ర కార్యక్రమానికి నిధుల కేటాయింపుపై విమర్శలను తప్పుబట్టిన సీఎం
- ప్రజలకు మంచి చేయడంలో పోటీ పడాలని రాజకీయ పార్టీలకు పిలుపు



అమరావతి: ప్రత్యర్థి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప మరేమీ చేతకాదని, వారిని గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మిగతా 2 లో

## రూ.60 వేల కోట్ల భూములు స్వాధీనం



హైదరాబాద్: ‘రాష్ట్రంలో ప్రజలు రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఆదరాభిమానాలు చూపడం మాకు ఎనలేని శక్తిని ఇచ్చిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. మేం పాలకులుగా కాకుండా సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. క్యూర్ ఏరియాలో ప్రభుత్వ భూములు, చెరువుల్లో కబ్జాలను తొలగించడం ద్వారా రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా భూములను హైడ్రా స్వాదీనం చేసుకుంది. మెట్రో రైలు కొనుగోలు చేసి ప్రజల ఆస్తిగా మార్చాం. ఫేజ్--1 కింద మూసీ ప్రక్షాళన ప్రారంభించాం. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని మిగతా 2 లో

### విశాఖ ఫార్మా, వ్యవసాయ ఎగుమతిదారులకు
## ప్రత్యేక రుణాలు అందించాలి

లోకేష్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపిన బ్యాంక్ యాజమాన్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రభుత్వ నియంత్రణలోని అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్‌తో కీలక చర్చలు జరిపారు. మాస్కోలో స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో భేటీ అయిన లోకేష్, భారత్‌లో బ్యాంకింగ్, టెక్నాలజీ, స్మార్ట్ సిటీ రంగాలలో సహకారానికి సంబంధించి పలు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... స్బేర్‌బ్యాంక్ అభివృద్ధి చేసిన ‘గిగాచాట్ ఎల్ఎల్ఎం’ను భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని మిగతా 2 లో



### తెలంగాణ నాలుగు కోట్ల
## మంది జాగీర్

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్

- తెలంగాణ ఇక్కడి భూమిపుత్రుల జాగీరని వ్యాఖ్య
- పవన్ ఎక్కడైనా పోటీ చేసుకోవచ్చన్న కేటీఆర్
- కానీ, సెక్రటేరియట్‌లో పెత్తనం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు.

హైదరాబాద్: తెలంగాణ ఇక్కడున్న నాలుగు కోట్ల మంది భూమి పుత్రుల జాగీరని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మిగతా 2 లో




## వాట్సప్ కాల్స్ రికార్డ్ అవాస్తవం.. సోషల్‌మీడియా పోస్ట్‌పై సజ్జనర్

- సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ అవుతున్న ఈ సందేశం పూర్తిగా అవాస్తవం
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు కొందరు ఆకతాయిలు ఇలా చేస్తున్నారు
- తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ఇదే విషయమై గతంలో పలుమార్లు అప్రమత్తం చేశాం

## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా
# డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు



- ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం
- పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ

హైదరాబాద్: తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే మిగతా 2 లో

## నెహ్రూ రికార్డు బద్దలు.. సుదీర్ఘకాలం పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!

- జూన్ 10 నాటికి ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకోనున్న మోదీ
- 4,398 రోజుల పాటు పాలించిన నేతగా ఇప్పటి వరకు నెహ్రూ పేరిట రికార్డు
- 4,077 రోజులు అధికారంలో ఉన్న ఇందిరా గాంధీ

అత్యధిక కాలం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ పేరిట రికార్డు




ఢిల్లీ: భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన మైలురాయిని అందుకోనున్నారు. దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానిగా మిగతా 2 లో

## రష్యా-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కీలక రక్షణ ఒప్పందం..

# పాకిస్థాన్‌కు కొత్త తలనొప్పులు!

ఢిల్లీ: అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతో రష్యా తన మొట్టమొదటి అధికారిక సైనిక-సాంకేతిక సహకార ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మాస్కోలో జరిగిన అంతర్జాతీయ భద్రతా సదస్సులో ఆఫ్ఘన్ రక్షణ మంత్రి మహ్మద్ యాకూబ్, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా తాలిబాన్లకు ఆయుధాల సరఫరా, సైనిక సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, శిక్షణ, సంయుక్త ప్రాజెక్టులు చేపట్టే అవకాశం ఉంది. గతంలో తాలిబాన్లను వ్యతిరేకించిన రష్యా, 2025లో తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించిన మొదటి దేశంగా నిలిచింది. ఇప్పుడు ఏకంగా వ్యూహాత్మక భద్రతా భాగస్వామిగా మారడం గమనార్హం. మాస్కోపై జరిగిన 'క్రాకస్ సిటీ హాల్' దాడి తర్వాత ఐసిస్-కె ఉగ్రవాద సంస్థను అణచివేయడం రష్యాకు అత్యంత కీలకంగా మారింది. అలాగే, 2021లో అమెరికా నిష్క్రమణ తర్వాత ఏర్పడిన శూన్యతను భర్తీ చేస్తూ మధ్య ఆసియాలో తన పట్టును నిలుపుకోవాలని రష్యా భావిస్తోంది. ఈ రక్షణ ఒప్పందం పాకిస్థాన్‌కు తీవ్ర కలవరాన్ని కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో సరిహద్దు ఘర్షణలు, టీటీపీ (తెహ్రీక్ ఇ తాలిబాన్ పాకిస్థాన్) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ఆశ్రయం కల్పిస్తోందనే పాక్ ఆరోపణల వల్ల తాలిబాన్-పాక్ సంబంధాలు క్షీణించాయి. ఇప్పుడు తాలిబాన్లకు రష్యా ఆయుధాలు అందిస్తే అది ఇస్లామాబాద్‌కు ప్రత్యక్ష భద్రతా సవాలుగా మారుతుంది. ఇది భారత్‌కు సానుకూల పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు చైనా ఇప్పటికే అఫ్ఘనిస్థాన్‌లోని లిథియం, రాగి వంటి ఖనిజ వనరులపై కన్నేసి తాలిబాన్లతో సంబంధాలను బలపరుచుకుంటోంది. ఈ రష్యా-తాలిబాన్ ఒప్పందం దక్షిణ, మధ్య ఆసియాలో అధికార సమీకరణాలను పూర్తిగా మార్చబోతోంది.

## ఇరాన్‌తో చర్చలు ఆగలేదు: ట్రంప్ స్పష్టత

ఢిల్లీ: ఇరాన్‌తో చర్చలు నిలిచిపోయాయంటూ వస్తున్న వార్తలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఇవి తప్పుడు ప్రచారాలని కొట్టిపారేశారు. ఇరు దేశాల మధ్య సంప్రదింపులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, ఇటీవలి రోజుల్లో కూడా అవి చురుగ్గా జరిగాయని స్పష్టం చేశారు. చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందన్న వాదనలు "తప్పుడు, నిరాధారమైనవి" అని ట్రంప్ అభివర్ణించారు. జూన్ 2వ తేదీన కూడా చర్చలు జరిగాయని తెలిపారు. "గత నాలుగు రోజులు, మూడు రోజులు, నిన్న, ఈరోజు... ఇలా ప్రతిరోజూ మా మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి," అని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. చర్చల్లో పురోగతి ఉన్నప్పటికీ, తుది ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అంగీకరించారు. 2025లో అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలు, హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ కార్యకలాపాల వంటి అంశాలపై అసంతృప్తితో చర్చలు ఆగిపోయాయని ఇరాన్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల ఉపసంహరణ, హార్ముజ్ జలసంధిని నౌకా రవాణాకు పూర్తిగా తెరవడం వంటివి ఈ చర్చల్లో కీలక అంశాలుగా ఉన్నాయి. గతంలో చర్చించడానికి ఇష్టపడని అణు అంశాలపై కూడా ఇరాన్ సుముఖత చూపిస్తోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. అయితే, ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదురుతుందన్న గ్యారెంటీ లేదని ఆయన హెచ్చరించారు.

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. 21 మంది సజీవ దహనం

ఢిల్లీ: ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 40 మందిని కాపాడారు. మాలవీయనగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 9 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షార్ట్ సర్క్యూటే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామన్నారు.

## తెలంగాణకు వర్ష సూచన..

# 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతో పాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులు సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు, దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాల సూచన ఉన్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# 2027 గోదావరి పుష్కరాలు చరిత్రలో నిలిచిపోవాలి

అమరావతి: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రుల కమిటీ, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని, ఇది యాత్రికులకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు ఉన్న ప్రాంతాన్ని 'అఖండ గోదావరి కారిడార్'గా అభివృద్ధి చేయాలని సూచించారు. పుష్కరాల కోసం అభివృద్ధి చేసే అన్ని మౌలిక సదుపాయాలు గోదావరి బేసిన్ ప్రాంతానికి శాశ్వత ఆస్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఈ పుష్కరాలతో రాజమహేంద్రవరం ఒక ప్రధాన మహానగరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పుష్కరాలకు దాదాపు 9.95 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. యాత్రికుల సౌకర్యార్థం రహదారి, రైల్వే ట్రాఫిక్ నిర్వహణపై దృష్టి పెట్టాలని, పుష్కర ఘాట్లకు క్రమపద్ధతిలో నంబర్లు కేటాయించాలని ఆదేశించారు. ప్రత్యేక రైళ్లు, కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన క్షేత్రస్థాయి పర్యటన సిఫార్సులను కూడా ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. జూన్ 24 నాటికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఆ తర్వాత పుష్కరాలకు అధికారికంగా కౌంట్‌డౌన్ ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు.

# కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం

మొదటి పేజి తరువాయి

మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర కూడా ఉన్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎంగా పరమేశ్వర ప్రమాణ స్వీకారం చేశారు. డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారానికి ముందు పీఠాధిపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. డీకే శివకుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు హాజరయ్యారు.

### ప్రమాణ స్వీకారం చేసినవారు

డీకే శివకుమార్ , జీ పరమేశ్వర్, కె హెచ్ మునియప్ప, కె జె జార్జ్, ఎం బీ పాటిల్, రామలింగ రెడ్డి, సతీశ్ జరకిహోళి, కృష్ణ బైరెగౌడ, ప్రియాంక్ ఖర్గే,యూటీ ఖాదర్, ఈశ్వర్ ఖండ్రే,యతీంద్ర సిద్ధరామయ్య, బైరతి సురేశ్, శరణ ప్రకాశ్ పాటిల్, లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం నేపథ్యంలో డీకే శివకుమార్ నివాసం బయట భద్రతను కట్టుదిట్టం చేశారు. శివకుమార్‌ను అభినందిస్తూ నగరమంతా అభిమానులు పోస్టర్లు ఏర్పాటు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పుకున్న సిద్ధరామయ్యకు శివకుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందే కాంగ్రెస్‌లో కీలక బాధ్యత లభించింది. ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న డీకే శివకుమార్ తన తల్లి గౌరమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, కర్ణాటకలో దీర్ఘకాలంగా సాగిన పోరు తర్వాత డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో 2023 మేలో అధికారంలోకి వచ్చింది.

### సోనియా గాంధీ సందేశం

డీకే శివకుమార్‌కు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. "అందరినీ కలుపుకుని ముందుకు సాగండి. మీరు కర్ణాటకకు విజయవంతంగా నాయకత్వం వహిస్తారనే సంపూర్ణ విశ్వాసం నాకు ఉంది. మీ కొత్త బాధ్యతను సమర్థంగా నిర్వహించండి" అని ఆమె చెప్పారు. అలాగే, పలువురు ప్రముఖులు డీకే శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# రూ.60 వేల కోట్ల భూములు స్వాధీనం

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. త్వరలో వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాల ఏర్పాటు పనులు ప్రారంభిస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడానికి రూ.లక్ష కోట్ల జీరో వడ్డీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే రూ.60 వేల కోట్ల రుణాలను పంపిణీ చేశాం. రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. కొత్తగా ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు 8 వేల స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశాం..'అని ముఖ్యమంత్రి తెలిపారు.

13 నెలల్లోనే 1.2 లక్షల ఇళ్లు.. 'రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభించి 13 నెలల్లోనే లక్షా 20 వేల ఇళ్లను పూర్తి చేశాం. సెప్టెంబర్ 17 నాటికి మిగతా 2 లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం. రెండో విడతగా క్యూర్ పరిధిలో లక్ష, మిగిలిన ప్రాంతాల్లో 2.5 లక్షలు కలిపి మొత్తం 3.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లనూ రెండో విడతలో పూర్తి చేయాలని నిర్ణయించాం. 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 3.38 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. స్కిల్డ్ వర్కర్లకు 25.9 శాతం, అన్ స్కిల్డ్ వర్కర్లకు 34.95 శాతం కనీస వేతనాలు పెంచాం. తెలంగాణ పోరాట యోధులను గుర్తించడానికి కమిటీని నియమించాం. త్వరలో ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అమలు చేయనున్నాం. రాష్ట్రాన్ని 2034 నాటికి ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ -- 2047 విజన్ డాక్యుమెంట్ ప్రకటించాం. 'తెలంగాణ భూమి నైసర్గిక స్వరూపం అన్ని రకాల పంటలు పండించడానికి అనుకూల క్షేత్రం. రైతులు కొన్ని పంటలకే పరిమితం కాకుండా అన్ని రకాల పంటలు, కూరగాయలు, పండ్లు పండించి తెలంగాణ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటి చెప్పాలి..'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలోనే కాదు.. ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది తన స్వప్నమని చెప్పారు. '2025--26లో 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగింది. రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోళ్లకు రూ.82,840 కోట్లు ఖర్చు చేశాం. యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 63.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.11,903 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. 10 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశాం. దేశంలో యాసంగిలో సేకరించిన మొత్తం ధాన్యంలో తెలంగాణ వాటా 60% కావడం గర్వకారణం. యాసంగిలో 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 4 లక్షల ఎకరాల్లో జొన్న సాగుతో రైతులు చరిత్ర సృష్టించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..'అని సీఎం చెప్పారు.

## విశాఖ ఫార్మా, వ్యవసాయ ఎగుమతిదారులకు

# ప్రత్యేక రుణాలు అందించాలి

మొదటి పేజి తరువాయి

భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని కోరారు. పాశ్చాత్య ప్లాట్‌ఫారమ్‌లకు ఇది ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నెట్‌వర్క్ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు, స్బేర్‌బ్యాంక్ యొక్క అత్యాధునిక వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఇంటిగ్రేట్ చేయడానికి సాంకేతిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. భారత్‌లో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యకలాపాలను మెరుగుపరచడానికి స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్ వంటి డిజిటల్ పరిష్కారాలను అందించాలని లోకేష్ సూచించారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజనీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు స్బేర్‌బ్యాంక్ యొక్క ప్రత్యేక శిక్షణా విధానమైన 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారత్‌లోని ప్రధాన విద్యా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోని ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం రూపాయి-రూబుల్ వాణిజ్యానికి అనుమతులు ఇవ్వడంతో పాటు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను వివరిస్తూ, న్యూఢిల్లీలోని కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్య ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. బెంగళూరులోని తమ ఐటీ హబ్, రూపాయి-రూబుల్ వాణిజ్య లావాదేవీలకు సమన్వయ కేంద్రంగా పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీ, ముంబైలోని తమ శాఖలు వ్యూహాత్మక వాణిజ్య కారిడార్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గేట్‌వేలుగా ఉన్నాయని వివరించారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని యెఫిమోవ్ హామీ ఇచ్చారు. మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న స్బేర్‌బ్యాంక్, రిటైల్ బ్యాంకింగ్‌తో పాటు క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో విస్తరించిన భారీ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రిటైల్, 35 లక్షల కార్పొరేట్ ఖాతాదారులను కలిగి ఉన్న ఈ బ్యాంకు, 12,000 శాఖలతో ప్రతిరోజూ 8 కోట్ల మంది డిజిటల్ వినియోగదారులకు సేవలందిస్తోంది.

## ఆరోగ్యమే అసలైన సంపద..

# జీవనశైలి మార్చుకోవాలి

మొదటి పేజి తరువాయి

గతంలో హైదరాబాద్‌లో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించిన విధంగానే రాబోయే రోజుల్లో ప్రపంచ నలుమూలల నుంచి రోగులు అమరావతికి వచ్చి చికిత్స పొందే పరిస్థితిని కల్పిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గుంటూరులో 600 పడకలతో, 32 విభాగాలతో అత్యాధునిక వసతులతో లలితా ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా, దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఆధునిక ఎమ్ఆర్ఐ స్కాన్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. "ఒక బ్రాండ్‌కు విలువలు, ప్రజల్లో విశ్వసనీయత తోడైతే దానికి తిరుగుండదు. దశాబ్దాలుగా వైద్య రంగంలో ఉన్న లలితా గ్రూప్ అందుకు నిదర్శనం" అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని సమూలంగా మారుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొచ్చాం. దీని ద్వారా ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు నిర్వహిస్తాం. వ్యాధి రాకముందే గుర్తించడం (ప్రిడిక్టివ్), రాకుండా నివారించడం (ప్రివెంటివ్), వచ్చాక నయం చేయడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో పనిచేస్తాం. ఇంటి వద్దకే వచ్చి 42 రకాల వైద్య పరీక్షలు చేస్తాం" అని వివరించారు. రాష్ట్రంలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని అమలు చేసి, ప్రతి కుటుంబానికి రూ.2.5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, ఆరోగ్యకరమైన పౌరులే సంపన్న దేశాన్ని నిర్మిస్తారని చంద్రబాబు అన్నారు. మంచి ఆహారం, వ్యాయామం, యోగా, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. "మన వంటిల్లే మన ఫార్మసీ. మనం తినే ఆహారమే మనకు రక్ష. కానీ ఈ రోజుల్లో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం పెరిగిపోయింది," అని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని ఆసుపత్రులు కట్టినా, ప్రజల జీవనశైలిలో మార్పు రానంత వరకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదని హితవు పలికారు.

# తెలంగాణ నాలుగు కోట్ల మంది జాగీర్

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అయితే, ఇక్కడికి ఎవరైనా రావొచ్చని స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వస్తే అడ్డుకుంటామని ఎవరూ చెప్పలేదని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ఆవిర్భావం రోజు హైదరాబాద్‌లో సభ పెడతానంటే ఎలా? అని ప్రశ్నించారు. "తెలంగాణ మీ అయ్య జాగీరా?" అంటూ మంగళవారం పవన్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయవాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదం అన్న పవన్ వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. మద్రాస్ నుంచి వేర్పాటు కోసం ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములుది కూడా ప్రాంతీయవాదమేనా అని ప్రశ్నించారు. తెలంగాణకు వస్తున్న అనేక పరిశ్రమలను ప్రధాని మోదీ తన స్వరాష్ట్రం గుజరాత్‌కు తరలించుకుపోతున్నారని కేటీఆర్ ఈ సందర్భంగా ఆరోపించారు. "జాతీయవాదం ముసుగులో మోదీ చేస్తున్న ఆర్థిక ప్రాంతీయవాదాన్ని ఏమంటారు?" అని ప్రశ్నించారు. దేశంలో ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టుకోవచ్చని కేటీఆర్ అన్నారు. అలాగే ఎక్కడైనా పోటీ చేసే హక్కు ఉందని తెలిపారు. జనసేన కొత్తగా పోటీ చేసేదేముందని.. 2018, 2023లో జనసేన తెలంగాణలో పోటీ చేయలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదన్న పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. అదే వ్యక్తి మళ్లీ తెలంగాణకు వ్యతిరేకం కాదంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు 'ఓజీ' కేసీఆర్ అని.. ఇంకెవ్వరూ అవసరం లేదన్నారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని కేటీఆర్ అన్నారు. సోదరుడిగా ఇంటికొస్తే బిర్యానీ పెడతామని వ్యాఖ్యానించారు. సినీ నటుడిగా, కళాకారుడిగా అభిమానిస్తాం. కానీ, సెక్రటేరియట్‌లోకి వచ్చి పెత్తనం చేస్తామంటే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్ ఓటర్ ఐడీకి

# మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!

హైదరాబాద్ : హైదరాబాద్ సహా తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) తమ ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. మొబైల్ నంబర్ లింక్ లేకపోతే, ఎన్నారైలు ఆన్‌లైన్‌లో తమ వివరాలను సమర్పించడం సాధ్యం కాదని, ఓటర్ల జాబితాలో చేరడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు తెలిపారు. ఎన్నారైలు తమ మొబైల్ నంబర్‌ను లింక్ చేయడానికి ఈసీఐ అధికారిక పోర్టల్ జశీవతీం.వఎఆ.స్రశీజ.ఆఅ ను సందర్శించాలి. అక్కడ ఫారం 8 (ప్రస్తుత ఓటర్ల జాబితాలో వివరాల సవరణ)ను పూర్తి చేయాలి. మొబైల్ నంబర్ నమోదు చేశాక వచ్చే ఓటీపీతో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఓటర్ ఐడీ కార్డులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి అని, ఫారం సమర్పించేటప్పుడు ఆధార్ అథెంటికేషన్ అవసరమని అధికారులు నొక్కిచెప్పారు. తెలంగాణలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీని ప్రకారం, జూన్ 15 నుంచి 24 వరకు ఓటర్ల జాబితా రూపకల్పన, జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. అభ్యంతరాలను ఆగస్టు 30 వరకు స్వీకరించి, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, తమ ఓటు హక్కును కాపాడుకోవాలనుకునే ప్రవాస భారతీయులకు ఈ ప్రక్రియ చాలా కీలకం. నిర్ణీత గడువులోగా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా వారు తమ రాష్ట్రంలోని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా కొనసాగవచ్చు.

## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

హైదరాబాద్: తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

## నెహ్రూ రికార్డు బద్దలు.. సుదీర్ఘకాలం

# పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!

ఢిల్లీ: భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన మైలురాయిని అందుకోనున్నారు. దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానిగా జూన్ 10న ఆయన సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న దశాబ్దాల నాటి రికార్డును మోదీ అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ.. జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. దేశంలో మొదటి సాధారణ ఎన్నికల తర్వాత 1952 మే 13న నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1964 మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ దాటనున్నారు. అంతకుముందు 2025 జులై 25న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరిట ఉన్న 4,077 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోదీ దాటేశారు. నెహ్రూ కాలంతో పోలిస్తే ప్రస్తుతం దేశ జనాభా, ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. తొలి సాధారణ ఎన్నికల సమయంలో దేశ జనాభా 34 కోట్లుగా ఉండగా ఓటర్లు 17 కోట్లు మాత్రమే. మోదీ ప్రధాని అయ్యే నాటికి జనాభా 131 కోట్లకు చేరి ప్రస్తుతం 146 కోట్లు దాటింది. అలాగే 1952 ఎన్నికల్లో కేవలం 53 పార్టీలు పోటీ చేయగా.. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి పోటీ చేసిన పార్టీల సంఖ్య ఏకంగా 744కు చేరింది. నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఏకైక ప్రధానిగా మోదీ నిలిచారు. కాంగ్రెసేతర ప్రధానిగా వరుసగా రెండుసార్లు పూర్తి మెజారిటీ సాధించిన రికార్డు కూడా ఆయనదే. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా కలిపి అత్యధిక కాలం (8,930 రోజులకు పైగా) అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ రికార్డు సృష్టించారు.

## గొడ్డలి పార్టీకి విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు

అమరావతి: ప్రత్యర్థి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప మరేమీ చేతకాదని, వారిని గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలే బహిష్కరించాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న విమర్శలపై చంద్రబాబు స్పందిస్తూ, "డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీకి టీడీపీ ఒక బ్రాండ్. అధికారంలోకి రాగానే తొలి సంతకంతో పారదర్శకంగా నియామకాలు చేపట్టాం. స్పోర్ట్స్ కోటాపై కనీస అవగాహన లేకుండా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే కేటగిరీలు నిర్ణయించి ఉద్యోగాలు ఇచ్చాం" అని వివరించారు. కొందరు తమ పేటిఎం బ్యాచ్‌ల ద్వారా ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలు ఏ అంశంపైనైనా మాట్లాడే ముందు అధ్యయనం చేయాలని హితవు పలికారు. "యోగాంధ్ర కార్యక్రమం కోసం రూ.10 కోట్లు కేటాయిస్తే దానిపైనా విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ నిర్మాణాత్మక నిర్ణయం తీసుకున్నా బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన జరిగి 12 ఏళ్లు గడిచిపోయిందని, ఈ సమయంలో ప్రజలకు ఎవరు మంచి చేశారో అందరికీ తెలుసని చంద్రబాబు అన్నారు. అనవసర వివాదాలు సృష్టించడం మానుకుని, ప్రజలకు మేలు చేయడంలో రాజకీయ పార్టీలు పోటీ పడాలని ఆయన సూచించారు.

## తెలంగాణపై నా నిబద్ధత ఈనాటిది కాదు: పవన్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనపై తన నిబద్ధత ఈ మధ్యే మొదలైంది కాదని జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ యువరాజ్యం విభాగానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు.. ఉస్మానియా విద్యార్థి నేతలు, గద్దర్‌తో కలిసి తెలంగాణ సామాజిక న్యాయసభలో పాల్గొన్నానని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ వీడియో పోస్ట్ చేశారు. వైఎస్ఆర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న సమయంలో.. తాను తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు బహిరంగంగా మద్దతు తెలిపానన్నారు. 'సామాజిక తెలంగాణ' కోసం గట్టిగా పిలుపునిచ్చినట్లు తెలిపారు. నాటి తన నిర్ణయమే తెలంగాణ పట్ల తనకున్న అచంచల నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు.

## వాట్సప్ కాల్స్ రికార్డ్ అవాస్తవం..

# సోషల్‌మీడియా పోస్ట్‌పై సజ్జనర్

హైదరాబాద్: వాట్సప్ కాల్స్ రికార్డ్ అవుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని హైదరాబాద్ సీపీ సజ్జనర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ అవుతున్న ఈ సందేశం పూర్తిగా అవాస్తవమన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు కొందరు ఆకతాయిలు ఇలా చేస్తున్నారని తెలిపారు. బాధ్యతగల పౌరులుగా ఇటువంటి ఫేక్ వార్తలను నమ్మొద్దని, ఎవరికీ షేర్ చేయొద్దని సూచించారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇదే విషయమై గతంలో పలుమార్లు అప్రమత్తం చేశామని, అయినా కొందరు ఉద్దేశపూర్వకంగా దీన్ని షేర్ చేస్తున్నారని మండిపడ్డారు.

పోస్ట్‌లో ఏముందంటే?

వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వం నిఘా పెట్టనుందని ఓ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొడుతోంది. 'ఇటీవల పరిణామాల దృష్ట్యా రేపటి నుంచి వాట్సప్, ఫోన్ కాల్ నియమాలు అమల్లోకి రానున్నాయి' అనేది ఆ పోస్ట్ సారాంశం. అన్ని కాల్స్ రికార్డు చేస్తారని, వాట్సప్, ఫేస్‌బుక్, ట్విటర్, ఇతర అన్ని సామాజిక మాధ్యమాలపై పర్యవేక్షణ ఉంటుందని ఆ పోస్టులో ఉంది. పలు సందర్భాల్లో ఇదే తరహా సందేశాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ వచ్చాయి. అందువల్ల ఇలాంటి సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## మేలో రికార్డు స్థాయిలో

# 1.21 కోట్ల శ్రీవారి లడ్డూల విక్రయం

తిరుమల: ఈ ఏడాది మే నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు తితిదే వెల్లడించింది. 2024 మే నెలలో 1.01 కోట్లు, 2025 మే నెలలో 1.10 కోట్ల లడ్డూలను విక్రయించగా.. ఈసారి సంఖ్య మరింత పెరిగింది. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూల తయారీకి తితిదే రోజువారీగా 68 టన్నుల ముడి పదార్థాలను వినియోగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతోంది.

## నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా తిలకించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి బృందం



నార్వే, నంద్యాల, నేటి శుభోదయ ::: బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్ లతో పాటు సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. పాలన, ప్రజా విధానాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై జరిగిన ఫలవంతమైన ఆలోచనల మార్పిడి విలువైన అవగాహనను అందించడమే కాకుండా, పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేసిందని, ఒకరినొకరు అనుభవాల గురించి నేర్చుకుంటూ, భవిష్యత్తులో మరింత బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు ఎదురుచూస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.



## 'స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కోసం ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం వహించాలి..'

– 'మునికూడలి' గ్రామ 'స్వచ్ఛ పథం' కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' సంకల్పంలో భాగంగా సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో 'స్వచ్ఛ పథం' (పరిసరాల పరిశుభ్రత) కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వయంగా చేతిలో చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేసి గ్రామస్తుల్లో సరికొత్త చైతన్యాన్ని నింపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన అనేది కేవలం ప్రభుత్వ సంకల్పంతోనే సాధ్యం కాదని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఇందులో కీలకమైనదన్నారు. మన ఇల్లే కాదు, మన ఊరిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి సామాజిక బాధ్యత. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగాల బారిన పడతాం, ఆరోగ్యకరమైన సమాజం కోసమే ప్రభుత్వం ఈ స్వచ్ఛ పథాన్ని ముందుకు తీసుకెళ్తోందని స్పష్టం చేశారు. మునికూడలి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటా తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని కోరారు. సీతానగరం మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సౌకర్యం మరియు వీధి దీపాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. మునికూడలి గ్రామ అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం వంటి పనులను నిరంతరం పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, మరియు మునికూడలి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామసేన అధ్యక్షులు 'కంబాల' కార్యాలయంలో ఘనంగా 'దుగ్గిరాల గోపాలకృష్ణయ్య' జయంతి వేడుకలు..!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, చీరాల పేరలా ఉద్యమం ద్వారా ఆంగ్లేయులను గడగడలాడించిన ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి వేడుకలను రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్, బత్తిన వీరాంజనేయులు, ఆనం చెల్లారావు, మండే గౌతమ్, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఆదం మణికంఠ, కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది వైసీపీ ఇన్చార్జ్ వడ్డి రఘురామ్ నాయుడులి




తాడేపల్లిగూడెం జూన్ 3 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రెండేళ్ల పాలన అంతా ఘోరంగా విఫలమైందని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు.పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పోస్టర్ వడ్డి రఘురామ్ నాయుడు వైసీపీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ అని రుజువయ్యిందని ఆయన పేర్కొన్నారు. 'వెన్నుపోటుకు, విధ్వంసానికి, అరాచకానికి, అబద్ధాలకు, డైవర్షన్ రాజకీయాలకు, అవినీతికి, దోపిడీ రెండేళ్ల చంద్రబాబు పాలన ప్రతిరూపం' అని ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమాలలో భాగంగా, జూన్ 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలతో చంద్రబాబుకు నిరసన సెగ తగుల్తోందని అన్నారు. ఎన్నికల్లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వైసీపీ పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాసరావు, వెలనాటి సత్తిబాబు,చిట్టూరి బాపన్న, కైగాల శ్రీనివాస్, తానేటి అజయ్ తదితరులు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు..

## శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న 'లెస్సపలికితివి' చిత్రం



విజయవాడ, మే 3 (అజయ్ నారగాని - నేటి శుభోదయ ) శ్రీదేవి ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న 'లెస్సపలికితివి' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతుంది.ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మైను మాట్లాడుతూ విజయవాడ పరిసర ప్రాంతాలు చిత్రానికి అనుగుణంగా ఉండడం వలన ఇక్కడ షూటింగ్ చేస్తున్నామని అన్నారు.ఈ చిత్రంలో అన్ని ఎమోషన్స్ ఉంటాయని, స్వచ్ఛమైన పల్లెటూరి ప్రేమకథతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, సెంటిమెంట్స్ కు పెద్దపీట వేశామన్నారు.కొండల పక్కన ఉండే పల్లెటూరి వాతావరణం కోసం విజయవాడ పరిసర ప్రాంతాలలో చిత్రకరిస్తున్నామని దర్శకులు మైను చెప్పారు.చిత్ర నిర్మాత ప్రకాశరావ్ మాట్లాడుతూ మా శ్రీదేవి ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మించిన చిత్రాలలో ని కథలకంటే లెస్సపలికితివి విభిన్నమైనదాన్నారు.ఈ చిత్రంలో హీరోగా ప్రభాస్ వర్మ, హీరోయిన్ గా ప్రసన్నా నటించగా శ్రీనివాస్, ఈశ్వరి, రవి, అరుణ చౌదరి, అజయ్ నారగాని,ప్రకాష్, మున్ని,సల్లా విజయ, జానులతారెడ్డి తదితరులు నటించారు. ఈ చిత్రానికి డి. ఓ. పి.ప్రవీణ్, సంగీతం రాణాప్రతాప్, కో డైరెక్టర్ ఎలుబండి శ్రీనివాస్ లు పనిచేస్తున్నారు.

## రిజిస్ట్రేషన్ల శాఖకు రికార్డు ఆదాయం

ఒక్క నెలలోనే రూ 1,700కోట్లు



అమరావతి, నేటి శుభోదయ ::: భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు మే నెలలో రికార్డు స్థాయిలో రూ 1,700 కోట్ల ఆదాయం సమకూరింది. సాధారణంగా వచ్చే సగటు ఆదాయానికి ఇది రూ 500 కోట్ల అదనం.ఏప్రిల్లో రూ 1,410 కోట్ల రాగా, ఈ రెండు నెలలు కలిపి రూ 3,110 కోట్ల రాబడి వచ్చింది. భూముల మార్కెట్ విలువ పెరుగుతుందనే కారణంతో భారీ స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది. కాగా 2024-25 ఎఫ్ వై లో మే లో రూ 1,390 కోట్ల రూ 1,079 కోట్ల , 2025-26 మేలో ఆదాయం వచ్చింది.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అవసరం



గుడివాడ, జూన్ 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయవాడ కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ కార్యాలయ పర్యవేక్షణలో ఈనెల 5వ తేదీ శుక్రవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అనేక గ్రామాలలో




జరుగుతున్నటువంటి ప్రచార కార్యక్రమాలలో భాగంగా బుధవారం గుడివాడలోని ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలు తెలియచేయడం జరిగిందన్నారు.అలాగే ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే అనర్థాలు, ఓజోన్ పొర విశిష్టత గురించి మన జీవన విధానాన్ని మెరుగుపరుచుకునే విధంగా తెలియచేసిమన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం పరిసరాల పరిశుభ్రత పారిశుద్ధ్య పరిరక్షణకు తీసుకోవలసిన అనేక జాగ్రత్తలపై అమరావతి కల్చరల్ టీమ్స్ గుడివాడ బిల్లపాడు కళాకారుల బృందం ఎడవల్లి వీరయ్య, ఎడవల్లి నాగేంద్ర రవితేజలచే కళాజాతా ప్రదర్శన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రజలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉంది..

-వైసీపీ మాజీ మంత్రులు పేర్ని నాని,

కొడాలి నాని వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే రాము.



గుడివాడ, జూన్ 3 (అజయ్ నారగాని - నేటి శుభోదయ) వైఎస్ఆర్సీపీ అబద్ధాల ఫ్యాక్టరీ.. కళ్లు కూడా ఆర్పకుండా అబద్ధాలు చెబుతారు. గుడివాడలో ఎస్. ఐ. ఆర్. శిక్షణ పేరుతో అబద్ధాల ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చారు. చెప్పింది ఏదీ చేయని వ్యక్తి జగన్ మడమ తిప్పడం ఆయన నైజం.అందుకే ప్రజలు కూటమికి అఖండ మెజారిటీ ఇచ్చారు.చంద్రబాబు ఏ పనిచేసినా క్లియర్ ప్లానింగ్తో చేస్తారని,అమరావతిపై పూర్తి ప్రణాళికలు ఉన్నాయన్నారు. ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి అభివృద్ధి దిశగా ముందుకు వెళుతుందన్నారు.మూడు ఊర్ల పేర్లు చెప్పి 'మావిగెన్' అంటూ ట్రెండ్ సృష్టిస్తున్నారని, రాజధానిపై జగన్ కు కనీస ప్లాన్ కూడా లేదన్నారు.16వేల టీచర్ల నియామకం, బదిలీలు ఓపెన్గా జరిగాయన్నారు. రాజకీయ స్వార్థానికి వైసిపి అసత్య ఆరోపణలు చేస్తుంది. గుడివాడ అభివృద్ధి గురించి కొడాలి నానికి ఏమీ తెలియదన్నారు. పార్కుల్లో చెత్తను కూడా తీయించలేకపోయాడన్నారు. ప్రజలకు మంచినీళ్లు ఇవ్వలేక ట్యాంకులు తిప్పారు.. డ్రైన్లలో డీసిల్టింగ్ సంగతి సరేసరే.కొడాలి నాని వల్లే వైసీపీకి 2-3 శాతం ఓట్లు పోయాయని వారి పార్టీ నేతలే చెబుతున్నారు.కూటమి ప్రభుత్వంలో డ్రైనేజీలు క్లీన్ చేయించానని , పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.చంద్రబాబు గురించి మాట్లాడితే పెద్దోడు అవుతానని భ్రమలో కొడాలి నాని ఉన్నాడని ఎద్దేవా చేశారు.

## ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

=గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

-ప్రజావేదికలో ప్రజా సమస్యల అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే రాము

-ఓబన్న విగ్రహ ఏర్పాటుకు వడ్డెర సంఘం కౌతవరంలో రోడ్డు సమస్యలపై స్థానికుల వినతులు -పాలసీ సమస్యలు కొంత ఆలస్యమైనా పరిష్కరిస్తాం..ఎమ్మెల్యే రాము




గుడివాడ జూన్ 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉందనీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పునరుద్ఘాటించారు.స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు.పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు ఎమ్మెల్యే రామును కలిసి వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. గుడివాడలో పోరాటయోధుడు ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘ నాయకులు ఎమ్మెల్యే రాముకు వినతిపత్రం అందించారు. గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో రోడ్డు సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక నివాసితులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. పెన్షన్లు, ఇంటి స్థలాల సమస్యలపై పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ అర్జీలను ఎమ్మెల్యే రాముకు అందించారు. సమస్యలపై వచ్చిన వారితో ఎమ్మెల్యే రాము సావధానంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి అర్జీని స్వయంగా పరిశీలిస్తానన్నారు. అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ప్రభుత్వ పాలసీ సమస్యలు కొంత ఆలస్యమైనా తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉందనీ పునరుద్ఘాటించారు. వడ్డెర సంఘం కోరిన ఓబన్న విగ్రహ ఏర్పాటు, కౌతవరం రోడ్డు సమస్య వంటి అంశాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం" అని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

## ప్రతిష్టాత్మక ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2027 అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం జూన్ 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్- 2027 అవార్డుల కోసం అర్హత కలిగిన బాల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి ఎం.ఎన్ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు- సంస్కృతి, విజ్ఞానం- సాంకేతికత వంటి రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 5 నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలు (31 జూలై 2026 నాటికి) ఈ అవార్డులకు అర్హులని ఆమె పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు లేదా వారి తరఫున నామినేషన్లు సమర్పించదలచిన వారు 31 జూలై 2026 లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు, నామినేషన్లను ద్వారా సమర్పించవచ్చని తెలిపారు.కృష్ణా జిల్లాకు చెందిన అర్హులైన బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి విజ్ఞప్తి చేశారు.

## 22 నుండి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు- 26 న శ్రీవారి కళ్యాణం



ఒంగోలు, నేటి శుభోదయ ::: ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను జూన్ 22 వ తేదీ సోమ వారం నుండి 25 తేదీ గురువారం వరకు త్రయాహ్నిక దీక్షతో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. 26 వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 లకు శ్రీవారి కల్యాణోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే పలు కార్యక్రమాలలో పాల్గొన దలచిన భక్తులు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

## 'వికాస్ ఫార్మసీ కళాశాల' చైర్మన్ తన్నీరు చిన సుబ్బారావుకు పలువురు ప్రముఖుల ఘన నివాళులు..!

– సంతాపాన్ని వ్యక్తం చేసిన ఫార్మసీ రంగ ప్రముఖులు..బంధుమిత్రులు..!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);వికాస్ ఫార్మసీ కళాశాల చైర్మన్ తన్నీరు చిన సుబ్బారావు మృతికి పలువురు ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. వికాస్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుండి శ్రేయభిలాషులు, మిత్రులు వచ్చి డాక్టర్ టివి నారాయణను, వారి కుటుంబ సభ్యులను కలుసుకుని పలకరించారు. స్వర్గీయ సుబ్బారావు వయస్సు 84 సంవత్సరాలు. వీరు కళాశాల ప్రారంభం నుండి కళాశాల అభివృద్ధి కి అనేక విధాలుగా సేవలందించారు. వీరు గతంలో రిక్షా యాజమానుల,కార్మికుల సంఘానికి పలుసార్లు అధ్యక్ష కార్యదర్శి గా, రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ గా రెండు సార్లు సేవలందించారు. స్వర్గీయ సుబ్బారావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె గలరు. పెద్ద కుమారుడు డా.టీ వీ నారాయణ కళాశాల డైరెక్టర్, సత్య శ్రీనివాస్ రిటైర్డ్ బిఎస్ ఎన్ ఎల్ ఆఫీసర్, నగేష్ కుమార్, జ్యుడిషియల్ డిపార్ట్మెంట్, కుమార్తె పద్మావతి వున్నారు. కాగా సుబ్బారావు ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చాలని వికాస్ కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ కళాశాలలకు చెందిన ప్రతినిధులు, మిత్రులు కోరారు.



# ఓటమితో ముగిసిపోకు.. ఉదయించే సూర్యుడివి కా!

సాయంసంధ్యా సమయం భానుడు పడమటి దిక్కున అస్తమించే ఆ అద్భుత ఘట్టం ప్రకృతి ప్రసాదించిన ఒక పరమాద్భుత దృశ్య కావ్యం. ఆకాశమంతా ఎర్రటి, నారింజ, సువర్ణ వర్ణాల మేళవింపుతో ఒక దివ్యమైన కాన్వాస్‌లా మారిపోతుంది. ఆ క్షణాన, పరుగుల జీవితాన్ని కాసేపు పక్కన పెట్టి, ఆ రమణీయ దృశ్యాన్ని చూసే వారెవరైనా సరే ఒక్కసారిగా మైమరచి ఆగిపోతారు. నిశ్శబ్దంగా సాగిపోయే ఆ అస్తమయం మనతో ముఖాముఖి మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. ఇది ముగింపు కాదు నేస్తమా ఇది రేపటి నూతన ఉదయానికి నేను వేస్తున్న పవిత్ర నాంది అని ప్రకృతి మనకు మౌనంగా, గంభీరంగా ప్రబోధిస్తుంది.సరిగ్గా అదే విధంగా, మన మానవ జీవితంలో ఎదురయ్యే ప్రతి ముగింపూ, ప్రతి ఘోర అపజయమూ, గుండెను పిండేసే ప్రతి వేదనా అంతిమంగా ఒక సరికొత్త వైభవ ఆరంభానికి తెరతీస్తాయి. ఈ నిత్య సత్యాన్ని, జీవన తత్వాన్ని గుండెల్లో పదిలంగా నాటుకున్న ఏ వ్యక్తైనా సరే, జీవితంలో ఎలాంటి సంక్షోభాలు ఎదురైనా వెనకాడరు, అసలు వేసారరు. వారు ప్రతి ఓటమినీ గెలుపుకు పునాదిగా మార్చుకుంటారు.మానవ జీవితం అనేది ఒక సుదీర్ఘమైన, ఊహించని మలుపులతో కూడిన ప్రయాణం. ఈ ప్రయాణంలో గెలుపోటములు, ఎత్తుపల్లాలు సహజమైన మైలురాళ్ళు. ఒకప్పుడు మనం ఎంతో సమున్నతంగా నిలబడిన చోటు నుంచే అకస్మాత్తుగా కిందపడటం జరుగుతుంది. రాత్రికి రాత్రే ప్రాణప్రదమైన ఉద్యోగం ఊడిపోవచ్చు, ఎంతో కష్టపడి నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యం కళ్ళముందే కూలిపోవచ్చు, శ్వాసగా భావించిన ప్రేమ విఫలమవ్వచ్చు, లేదా ప్రాణ స్నేహితులే నమ్మకద్రోహం చేసి దూరం కావచ్చు.అలాంటి క్లిష్ట సమయాల్లో మన బలహీనమైన మనసు తీవ్రమైన నైరాశ్యంతో, ఇక అంతా అయిపోయింది,నా జీవితం ముగిసిపోయింది అని పదే పదే చెప్తుంది. కానీ, సరిగ్గా ఆ నిరాశామయ క్షణంలోనే మన అంతరాత్మలో ఒక మహత్తరమైన, అజేయమైన సంకల్ప శక్తి మేల్కొనాలి. అది మనం పడమర సూర్యుడిని చూసి నేర్చుకోవాల్సిన పరమ పవిత్రమైన పాఠం. ఈ రోజుకు సూర్యుడు సెలవు తీసుకున్నా, రేపటి ఉషోదయం మళ్ళీ కొత్త కాంతులతో వస్తుందనే నమ్మకమే మనల్ని నడిపించాలి.ప్రపంచ చరిత్ర పుటలను ఒకసారి తిరగేస్తే, మనకు ఆరాధ్యులైన మహాత్ములందరూ ఒకప్పుడు ఘోరంగా పడిపోయిన తర్వాతే విప్లవాత్మకంగా లేచి నిలబడ్డారని అర్థమవుతుంది. అమెరికా చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన నాయకుడు అబ్రహాం లింకన్ జీవితాన్ని చూస్తే, ఆయన అనేకసార్లు ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూశారు. వ్యాపారంలో సర్వస్వం నష్టపోయి రోడ్డున పడ్డారు. మానసికంగా ఎంతో కుంగదీస్తూ ప్రియురాలిని కోల్పోయారు. అయినప్పటికీ ఆయన ఎక్కడా ఆగలేదు, తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. చివరకు అమెరికా సంయుక్త రాష్ట్రాల అత్యున్నత అధ్యక్ష పదవిని అధిరోహించి చరిత్ర సృష్టించారు.అలాగే, ఆధునిక ప్రపంచాన్ని వెలిగించిన శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ వేల సార్లు విఫలమయ్యాక గానీ విద్యుత్ దీపాన్ని కనుగొనలేకపోయారు. ఆ సమయంలో ఆయన, నేను వేయి సార్లు విఫలం కాలేదు, విద్యుత్ బల్బ్ తయారీకి పనికిరాని వేయి పద్ధతులను విజయవంతంగా కనుగొన్నాను అని ప్రకటించారు. ఈ అద్భుతమైన మాటల వెనక ఉన్న అసలైన జీవన తత్వం ఏమిటంటే ప్రతి అపజయమూ మనల్ని తదుపరి విజయానికి చేర్చే ఒక జ్ఞానపు మెట్టు మాత్రమే.

మన తెలుగు నేలపై, మన సమాజంలోనూ ఇటువంటి స్ఫూర్తిదాయక ఉదాహరణలు కోకొల్లలుగా కనిపిస్తాయి. ఏటా ప్రకృతి వైపరీత్యాలకు, వరదలకు, కరువు కాటకాలకు గురై సర్వస్వం కోల్పోయినా, మన తెలుగు రైతు మళ్ళీ గుండె నిబ్బరంతో నాగలి పట్టి భూమిలో విత్తనాలు వేస్తాడు. ఒక పోటీ పరీక్షల్లో దురదృష్టవశాత్తూ విఫలమైన విద్యార్థి, మరింత పట్టుదలతో, పగలు రాత్రి శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఒక సామాన్య వ్యాపారి, తనకున్న ఏకైక ఆస్తి అయిన నైపుణ్యాన్ని, శ్రమను నమ్ముకుని ఫీనిక్స్ పక్షిలా మళ్ళీ పైకి లేస్తాడు. ఇవన్నీ పడమర సూర్యుని ప్రతీకలే ఎన్నిసార్లు అస్తమించినా, మళ్ళీ అంతకంటే రెట్టింపు వేడితో, వెలుగుతో ఉదయించే అంతర్గత శక్తి మానవాళికి ఉందని ఇవి నిరూపిస్తాయి.మానవ జీవితంలో అత్యంత కష్టమైన పనేదైనా ఉందంటే అది నిరాశ అనే కారుచీకట్లో కాంతి కిరణం కోసం వెతకడమే. నిరంతర పోరాటాల వల్ల మనసు అలసిపోయినప్పుడు, మనం కన్న కలలన్నీ కళ్ళముందే సమాధి అయినట్లు అనిపించినప్పుడు కలిగే ఆ గుండె కోత, బాధ ఎంతో నిజమైనవి. ఆ వేదనను తక్కువ అంచనా వేయలేము. కానీ, మనం గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే ఆ వేదన శాశ్వతం కాదు. రాత్రి ఎంత సుదీర్ఘంగా, ఎంత చీకటిగా ఉన్నా, తెల్లవారుజామున తూరుపున వెలుతురు రావడం ఎంత సత్యమో, మన జీవితాల్లో కష్టాలు తీరడం కూడా అంతే సత్యం. అదే సృష్టి నియమం.మన బలహీనమైన మనసు చాలాసార్లు మనల్ని భయపెడుతూ మోసం చేస్తుంది. నువ్వు జీవితంలో ఏదీ సాధించలేవు, నీవల్ల ఏ పని కాదు, నీకు ఆ అదృష్టం లేదు అని నిరంతరం మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూనే ఉంటుంది. ఆ సమయంలో అంతరంగంలో వినిపించే ఆ నిరాశావాద గొంతుకను మనం అస్సలు నమ్మకూడదు. అది మన ఎదుగుదలను అడ్డుకొనే అంతర్గత శత్రువు యొక్క గొంతు. ప్రపంచంలో విజయకేతనం ఎగురవేసిన విజేతలందరూ ఆ గొంతుకను సమర్థవంతంగా అధిగమించినవారే. వారేదో భయం లేకుండా పుట్టలేదు, కాకపోతే భయాన్ని తమ వెంటే ఉంచుకుంటూనే సాహసంతో ముందుకు అడుగులు వేశారు. ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు, భయమున్నా కూడా వెనకడుగు వేయకుండా ముందుకు సాగిపోవడమే.సృష్టిలోని ప్రతి ముగింపులోనూ ఒక మధురమైన రహస్యం దాగి ఉంటుంది. జీవితంలో మనకు ఒక ద్వారం పూర్తిగా మూసుకుపోయినప్పుడు, భగవంతుడు అంతకంటే మెరుగైన మరో ద్వారాన్ని తెరుస్తాడు.

ఈ సత్యం కేవలం పుస్తకాల్లో చదువుకునే సామెత కాదు, ఒక గొప్ప జీవన వాస్తవం. ఒక మంచి ఉద్యోగం కోల్పోయినప్పుడు, మనలో దాగి ఉన్న అసలైన సృజనాత్మక ప్రతిభ ఏమిటో, మన సామర్థ్యమేమిటో కనుగొనే అద్భుతమైన అవకాశం దొరుకుతుంది. ఒక ఆత్మీయ బంధం ముగిసినప్పుడు, మనల్ని మనం మరింత లోతుగా అర్థం చేసుకునే ఆత్మపరిశీలన సమయం లభిస్తుంది. మనం ప్రాణప్రదంగా నమ్మిన ఒక కల విఫలమైనప్పుడు, అది మన నిజమైన గమ్యస్థానాలు, కలలేమిటో స్పష్టంగా తెలుసుకొమ్మని ప్రకృతి ఇచ్చే అమూల్యమైన సూచన. హేమంత రుతువులో చెట్టు ఆకులన్నీ రాలిపోవడం అంటే అది చనిపోవడం కాదు రాబోయే వసంతంలో కొత్త చిగుళ్ళకు, పూలకు స్థలం కల్పించడం. సముద్రపు అల ఎంతో ఉధృతంగా వచ్చి తీరానికి ఢీకొని పటాలుమని బద్దలైపోవడం వైఫల్యం కాదు తిరిగి అంతకంటే రెట్టింపు వేగంతో, మరింత పెద్ద అలగా ఎగిసిపడటానికి వెనక్కి వెళ్ళి సిద్ధమవడం మాత్రమే. ఇదే పడమర సూర్యుని అసలైన అంతస్సూత్రం. అస్తమించడం అనేది ఓటమి కాదు రేపటి సరికొత్త ఉదయానికి అవసరమైన ఇంధనాన్ని, శక్తిని సేకరించడం. జపనీస్ సంస్కృతిలో ఒక అద్భుతమైన, ఆలోచింపజేసే జీవన సిద్ధాంతం ఉంది. దాన్నే వారు "కింట్సుగీ" (ఖఅత్ంబస్త్రఅ) అని పిలుస్తారు. పొరపాటున విరిగిపోయిన పింగాణీ పాత్రలను పారేయకుండా, ఆ విరిగిన అంచులను మరియు పగుళ్ళను తంగేడు బంగారం లేదా వెండి వార్నిష్‌తో అతికించి సరిచేసే అరుదైన కళ అది. ఆశ్చర్యకరంగా, ఆ పాత్రకు విరిగిన చోట్లే బంగారు రేఖలు మెరుస్తూ, మునుపటి కంటే ఎంతో అందంగా, విలువైనదిగా మారుతుంది.అదే విధంగా మన జీవితంలో మనకు తగిలిన దెబ్బలు, గాయాలే మన అసలైన ఆత్మాభిమాన శక్తి. మన పడిపోయిన ఆ కఠినమైన సందర్భాలే మనకు భవిష్యత్తును నేర్పే గురువులు.

మన కంటి నుండి కారిన ప్రతి కన్నీటి చుక్కా, మన అంతరంగమనే మట్టిలో రేపు మొలకెత్తబోయే విజయ వృక్షానికి అవసరమైన అమృతం లాంటి నీరు.జీవితంలో ఎదురయ్యే ప్రతి సంక్షోభం వెనుక ప్రకృతి మనకు ఒక అద్భుతమైన సందేశాన్ని అందిస్తుంది. చెట్టు నుండి ఆకులు రాలడం అనేది ముగింపు కాదు, అది నూతన చిగురుకు నాంది. అలాగే, ప్రతి సాయంత్రం సంభవించే సూర్యాస్తమయం రేపటి ఉషోదయానికి బలమైన పునాది వేస్తుంది. మానవ జీవితంలో ఎదురయ్యే అపజయం లేదా ఓటమి మనల్ని కుంగదీయడానికి కాదు, అది తదుపరి విజయానికి సరైన మార్గదర్శిగా నిలుస్తుంది. చివరకు, కష్టాల వల్ల మనసు పగుళ్ళు బారడం అనేది వినాశనానికి సంకేతం కాదు, విరిగిన పింగాణీని అతుకులేసి మరింత అందంగా మార్చే జపనీస్ 'కింట్సుగీ' కళలా, అది పరిణతి చెందిన మరియు ఎంతో శక్తివంతమైన వ్యక్తిత్వానికి సంకేతం.ఈ పరమ సత్యాన్ని పూర్ణంగా అర్థం చేసుకున్న వ్యక్తి ఏ పరిస్థితిలోనూ అధైర్యపడరు, చిన్నబుచ్చుకోరు. ఒకసారి కిందపడినా, పదిసార్లు పడినా, వందసార్లు ఓడినా వారు మళ్ళీ రెట్టింపు ఉత్సాహంతో లేచి నిలబడతారు. ఎందుకంటే వారికి ఒక నగ్న సత్యం బాగా తెలుసు.ఈ కారుచీకటి రాత్రి కచ్చితంగా ముగుస్తుంది. మళ్ళీ తెల్లవారుతుంది. పడమర సూర్యుడు ఈ రోజు అస్తమించినా, రేపు ఉదయాన్నే తూర్పున నవకాంతులతో ఉదయిస్తాడు. ఆ అంతర్గత నమ్మకమే మనిషికి అత్యంత శక్తివంతమైన ఆయుధం.ఈ వ్యాసం చదువుతున్న మీలో ఎవరైనా ప్రస్తుతం జీవితంలో ఒక కఠినమైన ముగింపు దశలో నిలబడి ఉన్నారా తీవ్రమైన పరాజయంలో, నిరాశలో చిక్కుకున్నారా ఎంతో కాలంగా నమ్మిన ఒక స్వప్నాన్ని కోల్పోయి బాధపడుతున్నారా అయితే ఈ జీవన సందేశం ముమ్మాటికీ మీ కోసమే. మీరు ఇంకా ముగిసిపోలేదు, మీ అధ్యాయం ఇంకా పూర్తవలేదు. మీ అసలైన ప్రస్థానం ఇప్పుడే మొదలుకాబోతోంది.

ఒక్కసారి సాయంత్రం వేళ పడమర సూర్యుడిని చూడండి అతడు ప్రతి రోజూ అస్తమిస్తాడు, కానీ ఎప్పుడూ ఓడిపోడు. ప్రతిసారీ మరింత ప్రకాశవంతంగా తిరిగి వస్తాడు. ఆ అజేయమైన దృక్పథం, స్ఫూర్తి మీ దైనందిన జీవితంలో నిరంతరం మీతోనే ఉండనీయండి. జీవితం మీకు ఎన్ని ముగింపులు ఇచ్చినా, ప్రకృతి మీకు అంతకంటే ఎక్కువ ఆరంభాలను ప్రసాదిస్తుంది. ఆ అచంచలమైన నమ్మకంతో ముందడుగు వేయండి. ఆ సంకల్పంతోనే ప్రతిరోజూ మేల్కొనండి. ఆ నమ్మకంతోనే సరికొత్త స్వప్నాలను కనండి. ఎందుకంటే ప్రతి ముగింపు ఒక అద్భుతమైన ఆరంభమే. ప్రతి చీకటి రాత్రి ఒక వెలుగుల ఉదయమే. ప్రతి పతనం ఒక గొప్ప ఆత్మ పరిణామమే! ఇదే పడమర సూర్యుడు మనకు నేర్పే పరమ పవిత్రమైన పాఠం. ఇదే అసలైన జీవితం!

## చరిత్రాత్మక 'ముని కూడలి' ఘాట్ కు.. పుష్కర వైభవం

- మోడల్ ఘాట్ గా అభివృద్ధి .. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశం..
- గోదావరి జిల్లాల్లో అత్యంత వైభవంగా పుష్కరాల నిర్వహణ..
- గోదావరి నది తీరం పరిశుభ్రతతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పన.



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); పవిత్ర గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో వెలసిన ప్రముఖ 'దేవాన్ష్ పుష్కర్ ఘాట్'ను అన్ని హంగులతో, అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోనే ఒక 'మోడల్ ఘాట్' (ఆదర్శ ఘాట్) గా తీర్చిదిద్దనున్నట్లు రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆదేశాల మేరకు, ఈరోజు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు మరియు కూటమి నాయకులతో కలిసి మునికూడలి ఘాట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. మునికూడలి ఘాట్‌కు ఎంతో ఉన్నతమైన పౌరాణిక, ఆధ్యాత్మిక విశిష్టత ఉందని కొనియాడారు. గౌతమీ గోదావరి నదితో పాటు వశిష్ట గోదావరి ఉపనది, అంతర్వాహినిగా ప్రవహించే లక్ష్మీ నది ఇక్కడే సంగమిస్తాయని.. అందుకే దీనిని ఎంతో పవిత్రమైన 'త్రివేణీ సంగమ క్షేత్రం' గా భక్తులు నమ్ముతారని తెలిపారు. పూర్వం ఎంతో మంది మహర్షులు, మునులు ఇక్కడ కఠోర తపస్సు ఆచరించి సిద్ధి పొందిన పవిత్ర భూమి కాబట్టే దీనికి 'మునికూడలి' అనే సార్థక నామం ఏర్పడిందని గుర్తుచేశారు. ఇక్కడి సంగమ స్థానంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల గాఢ విశ్వాసమని, అందుకే పుష్కరాల సమయంలోనే కాకుండా నిత్యం వేలాది మంది భక్తులు, యాత్రికులు ఈ క్షేత్రానికి తరలివస్తుంటారని పేర్కొన్నారు. ఇంతటి మహోన్నత ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన ఘాట్‌ను కూటమి ప్రభుత్వ హయాంలో అద్భుతంగా తీర్చిదిద్దడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. మునికూడలి ఘాట్‌కు ఎంతో ఆధ్యాత్మిక విశిష్టత ఉందని, పుష్కరాల సమయంలో ఇక్కడికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి చిన్న ఇబ్బంది కూడా కలగకుండా, అత్యుత్తమ వసతులను ఇక్కడ కల్పించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ఆ దిశగానే ఈరోజు అధికారులతో కలిసి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఘాట్ వద్ద భక్తుల రద్దీని తట్టుకునేలా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ప్రత్యేక నిధులను కేటాయించి, ఘాట్ విస్తరణ మరియు ఆధునీకరణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నదీ జలాలు కలుషితం కాకుండా నిరంతరం శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఘాట్ పరిసర ప్రాంతాలలో 24 గంటలూ పారిశుధ్య పనులు జరిగేలా ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా దీనిని తీర్చిదిద్దుతామన్నారు. పుష్కరాల సమయానికి వచ్చే భక్తులకు అవసరమైన



తాగునీటి సదుపాయం, మహిళలకు తగినన్ని దుస్తులు మార్చుకునే గదులు, క్రమశిక్షణతో కూడిన క్యూలైన్ల ఏర్పాటును ముందస్తుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నదిలో స్నానాలు ఆచరించే భక్తుల రక్షణ కోసం సేఫ్టీ బారికేడ్ల ఏర్పాటు, ప్రమాదాలు జరగకుండా లైఫ్ గార్డుల నియామకం మరియు నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాల ఏర్పాటుపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీస్ మరియు వైద్యాధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని, పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ , మరియు భారతీయ జనతా పార్టీ కూటమి ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది మరియు భారీ సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ నిధుల ఖర్చుపై ప్రజలకు వివరాలు వెల్లడించాలి

### అభివృద్ధి నిధుల వినియోగంపై పారదర్శకత కోరిన టీడీపీ



గూడెం కొత్తవీధి, నేటి శుభోదయ, జూన్ 3: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతే గూడెం కొత్తవీధి మండలంలోని 16 పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, ఆయా నిధులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు వెల్లడించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.సమాచార హక్కు చట్టం ప్రకారం సంబంధిత పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి నిధుల ఖర్చుల వివరాలను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ప్రజల ముందు ఉంచాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకెళ్తామని హెచ్చరించారు.ఈ మేరకు మండల ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబుకు టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్ర బలరాం, పీఏసీఎస్ చైర్మన్ మొట్టడం నూకరాజు, టీడీపీ యువత అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు, మాజీ కార్యదర్శి ముక్కలి మహేష్, క్లస్టర్ వడేలు పాండురాజు, నాయకులు సాగిన భీమేశ్వర్ పడాల్, మామిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపైకి 5,500 విద్యుత్ బస్సులు!..మరో 500 సిఎన్జి బస్సులు

### -వచ్చే నెల నుంచి దశలవారీగా పరుగులు

అమరావతి, జూన్ 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఆర్టీసీలో కాలం చెల్లిన, ఎక్కువ కిలోమీటర్లు తిరిగిన బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. దశలవారీగా మొత్తం 6వేల బస్సులు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా, ఇందులో విద్యుత్ బస్సులు 5,500, సీఎన్జ బస్సులు 500 ఉంటాయి. పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్, డీలక్స్, సిటీ బస్సుల్లో కాలం చెల్లినవి ఏవేవి ఉన్నాయో, వాటి స్థానంలో విద్యుత్ బస్సులను అవే సర్వీసులుగా నడపనున్నారు.



### జులై నుంచి మొదలు

ప్రధానమంత్రి ఈ-బస్ సేవ పథకం కింద 750 విద్యుత్ బస్సులు రాష్ట్రానికి కేటాయించారు. వీటిని 11 నగరాల్లోని 12 డిపోల పరిధిలో అద్దె ప్రాతిపదికన నడుపుతారు. వీటిలో 300 బస్సులు జులైలో రోడ్డెక్కనున్నాయి. ఆగస్టులో మిగిలిన 450 రానున్నాయి. తిరుమల ఘాట్లో డీజిల్ బస్సుల స్థానంలో నడిపేందుకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి 300 విద్యుత్ బస్సులు మంత్రిత్వశాఖ మంజూరుచేసింది. ఇతర నగరాల్లో తీసుకునే విద్యుత్ బస్సులు 12 మీటర్ల పొడవుతో ఉండగా, ఘాట్లో నడిపేవి 9 మీటర్ల పొడవుతోనే ఉంటాయి. వీటికి కేంద్రమే టెండర్లు పిలిచింది. ఈ వారంలో వాటిని తెరవనున్నారు.గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ విధానంలో 1,450 విద్యుత్ బస్సులు ఆర్టీసీ తీసుకోనుంది. దీనికోసం ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదన సిద్ధమైంది. జులై నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, వచ్చే ఏడాది మార్చి నుంచి విద్యుత్ బస్సులు పరుగులు పెట్టేలా చూడనున్నారు.పూర్వోదయ పథకం కింద కేంద్రం పలు రాష్ట్రాలకు విద్యుత్ బస్సులు కేటాయిస్తుండగా, అందులో ఏపీకి వెయ్యి బస్సులు ఇవ్వనుంది. గ్రామీణ ప్రాంతాలు, కొంత దూర ప్రాంతాలకు నడిపేందుకు వీలుగా మరో 2 వేల బస్సులను పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద తీసుకోనున్నారు. ఈ ప్రతిపాదన కేంద్రం వద్దకు వెళ్లింది.సీఎనీ అందుబాటులో ఉన్న నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 500 సీఎన్జీ బస్సులు ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. సీఎన్జీ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు.

### ఇప్పుడున్న బస్సుల రంగులే.

పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ వంటి బస్సులకు ఇప్పుడున్న రంగులే.. విద్యుత్ బస్సుల్లో కూడా ఉంటాయని, దీనివల్ల ప్రయాణికులకు ఎటువంటి గందరగోళం ఉండదని అధికారులు చెబుతున్నారు.

## రోజుకో డ్రామా.. పూటకో నాటకం

-అమరావతిపై విషంకక్కుతున్న వైసీపీ నాయకుడు


-నాడు అమరావతి రైతులపై తప్పుడు కేసులు.

-నేడు నేనున్నానంటూ మొసలి కన్నీరు-నలుగురున్న నీ ఫ్యామిలీకి 4 ప్యాలెస్ లు

-5 కోట్ల మంది ఆంధ్రులకు మంచి రాజధాని వద్దా..

-మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు

=జగన్ తీరును ఎండగట్టిన మంత్రి సవిత



అమరావతి, జూన్ 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ అమరావతి రాజధానికి మొదట అనుకూలమని చెప్పి అధికారంలోకి రాగానే గొడ్డలి వేటు వేసిన నీచ చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ ధ్వజమెత్తారు. నాడు అక్రమ కేసులతో అమరావతి రైతులను ఇబ్బంది పెట్టిన జగన్.. నేడు మొసలి కన్నీరు కార్చుచున్నారని మండిపడ్డారు. జగన్ డైవర్ట్ పాలిటిక్స్ కోసం అమరావతి రైతులను వాడుకోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. సూర్య చంద్రులు ఉన్నంత కాలం అమరావతి రైతుల త్యాగాలను రాష్ట్ర ప్రజలు మరిచిపోరని కొనియాడారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో పాల్గొనడానికి వచ్చిన మంత్రి సవిత తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ ఆలోచించి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అమరావతి ప్రాంత రైతులు సుమారు 34వేల ఎకరాలు ఇచ్చారన్నారు. రూపాయి ఖర్చు లేకుండా విజయవంతంగా ల్యాండ్ పూలింగ్ చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదేనన్నారు. యువత భవిష్యత్ దృష్ట్యా అమరావతి నిర్మాణం ప్రారంభిస్తే.. జగన్మోహన్ రెడ్డి అధికారం అడ్డం పెట్టుకుని మూడు ముక్కలాట ఆడి రాజధాని ప్రాజెక్టు అటకెక్కించాడని మండిపడ్డారు. జగన్ లాంటి వ్యక్తులకు భయపడే అమరావతికి చట్టబద్ధత హోదా తీసుకొచ్చామని, అయినప్పటికీ రాజధానిపై తన అక్కసును వెళ్లగక్కుతూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో అనంతపురంలో కియా పరిశ్రమ రాకుండా అడ్డుకోవాలని చూశారని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, ఉద్యోగాలు, పెట్టుబడులు రాకుండా చేయాలని జగన్మోహన్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు.

### జగన్ ఫ్యామిలీకి ప్యాలెస్ లు..

### 5 కోట్ల ఆంధ్రులకు రాజధాని వద్దా..

జగన్ ఫ్యామిలీ ఉండటానికి మాత్రం వందల ఎకరాల్లో భవనాలు నిర్మించుకోవచ్చని, అయిదు కోట్ల ఆంధ్రులకు మాత్రం రాజధాని వద్దంటూ వితండవాదం చేస్తున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్, ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఉండటానికి రుషికొండలో రూ.500 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. కానీ రాజధాని నిర్మాణానికి అసలు ఖర్చు ఎందుకని ప్రభుత్వంపై పడి ఏడుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలో 2 ఎకరాల్లో, హైదరాబాద్ లో 30 ఎకరాల్లో, పులివెందులలో వందల ఎకరాల్లో ప్యాలస్ లు నిర్మించుకోవచ్చా... రాజధానికి మాత్రం కేవలం 400 ఎకరాలు ఉంటే సరిపోతాయని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. అమరావతి రాజధానికి మొదట అనుకూలమని చెప్పి అధికారంలోకి రాగానే గొడ్డలి వేటు వేసిన నీచ చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ధ్వజమెత్తారు. నాడు అక్రమ కేసులతో అమరావతి రైతులను ఇబ్బంది పెట్టిన జగన్.. నేడు మొసలి కన్నీరు కార్చుతున్నారని మండిపడ్డారు. జగన్ డైవర్ట్ పాలిటిక్స్ కోసం అమరావతి రైతులను వాడుకోవడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఏం మాట్లాడాలో తెలియ జగన్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని జగన్ పై మంత్రి సవిత మండిపడ్డారు

### డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు

డీఎస్సీ నిర్వహించి ఏడాది అవుతోందని, డీఎస్సీని ఆపాలని గొడ్డలి పార్టీ ఎన్ని కేసులు వేసిన వాటిని జయించి యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16 వేల టీచర్ ఉద్యోగాలు కల్పించామని మంత్రి సవిత తెలిపారు. ఏడాది తరవాత ఇప్పుడు అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేసి అభ్యర్థులను తీవ్రంగా అవమానిస్తున్నారని జగన్ పై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో యువతకు భరోసా, మహిళలకు భద్రత కల్పిస్తున్నామన్నారు. డీఎస్సీ సృష్టికర్త చంద్రబాబు నాయుడేనని, 1995, 1996,1998, 2000, 2018, 2025లో అనేక డీఎస్సీలు విజయవంతంగా నిర్వహించి రెండు లక్షలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన చరిత్ర ఆయనదేనని అన్నారు. జగన్ హయంలో ఒక్క టీచర్ పోస్టు అయినా భర్తీ చేశారా..? అని నిలదీశారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి వారిని నిలువు మోసం చేశారని మండిపడ్డారు. టీచర్లను వైన్ షాపుల దగ్గర కాపలా పెట్టిన నీచ చరిత్ర జగన్ దన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించడంతో ప్రజల్లో విశేష స్పందన వస్తోందన్నారు. ప్రజల ఆలోచనను డైవర్ట్ చేయడానికే ఇప్పుడు డీఎస్సీలో అక్రమాలు అంటు దొంగ నాటకాలు ఆడుతున్నారని జగన్ పై మంత్రి సవిత తీవ్రంగా మండిపడ్డారు.

### రోజుకో డ్రామా.. పూటకో నాటకం.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి చేశామని, త్వరలోనే ఎయిర్ పోర్టును ప్రారంభిస్తామని వెల్లడించారు. రాయలసీమలో లక్ష కోట్ల రూపాయలతో హార్టి కల్చర్ హబ్ డెవలప్ చేస్తున్నామన్నారు. వైసీపీని ప్రజలు మరిచిపోతున్నారని, అందుకే ఇలా రోజుకో డ్రామా, పూటకో నాటకంతో జగన్ ముందుకొస్తున్నారని ఎద్దేవా చేశారు. ముందుకు వస్తున్నారు. తండ్రి మరణం నుంచి వివేక హత్య వరకు అనేక డ్రామాలు సృష్టించారన్నారు. నంద్యాలలో గొడ్డలి పార్టీ వాళ్లే వైఎస్సార్ విగ్రహం పగలకొట్టి అది తమ పార్టీపై నెట్టాలని చూశారన్నారు. కడపలో పెద్ద దస్తగిరిని ఎవరు హత్య చేశారో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. పార్టీలు, రాజకీయాలకతీతంగా కూటమి పాలన సాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు చాలా తెలివైన వారని, అవినీతికి, అభివృద్ధికి స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 2029 ఎన్నిలోనూ కూటమి పార్టీలకే మరోసారి పట్టం కడతారని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు.

## 'స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలి..'

– పార్టీ కమిటీలకు దిశా నిర్దేశం చేసిన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ఇటీవల నూతనంగా నియ మించిన గ్రామ కమిటీలు భవిష్యత్తులో చేపట్టా ల్సిన కార్యక్రమాలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కం పూడి రాజా దిశా నిర్దేశం చేశారు.కోరుకొండలో రాజా స్వగృహం లోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని విభాగాలకు సంబంధించిన గ్రామ కమిటీలతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. విభాగాల వారీ కమిటీలు రానున్న రోజుల్లో పార్టీ అధిష్టానం నిర్దేశించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత తీసుకోవాలని సూచించారు.



గ్రామాల్లో ప్రజా సమస్యలు గుర్తించి వారికి ప్రతి ఒక్క రూ అండదండగా నిలవాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండకడుతూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం సాగించాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచించారు.రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు.మండల వ్యాప్తంగా ముఖ్య నాయకుల తో పాటు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## "ప్రజాసమస్యల పరిష్కారం వేగవంతంగా జరగాలి

:ఎమ్మెల్యే బొలిశెట్టి




తాడేపల్లిగూడెం జూన్ 3 (అవినాష్ మారంపూడి నేటి–శుభోదయ)::: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్)లో వచ్చే సమస్య లను వేగంగా పరిష్కారించాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండల ప్రజా పరిషత్తు సర్వ సభ్య సమావేశం బుధవారం జరిగింది. మండల పరిషత్తు అధ్యక్షురాలు కట్టుబోయిన వేంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లు, పట్టాదారు పాస్ బుక్కులు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. కొత్త పింఛన్లు, ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమం త్వరలోనే ప్రారంభమవుతుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు.ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆశయాలను నెరవేర్చే విధంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని అన్నారు. కుటుంబ సర్వేలో జనాభా తగ్గడానికి గల కారణాలను లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. త్వరలో జరగనున్న ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు శ్రద్ధగా నిర్వహించాలన్నారు. అనర్హుల ఓట్లు తొలగించటం, అర్హులఓట్లు కాపాడటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం సమగ్రంగా జరగటానికి ఖచ్చితమైన సమాచారాన్ని అందించి ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యురాలు ఉప్పులూరు వరలక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట్రావు, ఉపాధ్యక్షురాలు ముప్పిడి సరోజిని, తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనానికి బుధవారం విచ్చేయగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ ఈవో శీనానాయక్ ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించి, వేద పండితులతో వేద ఆశీర్వచనం చేయించి అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## విఎంసి కు సేవలందించి పదవి విరమణ అయిన ఉద్యోగులకు విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఘన సన్మానం



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– విజయవాడ నగరపాలక సంస్థలో సుదీర్ఘకాలం పాటు వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను విఎంసి కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయం లో గల తమ ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు శాలువాలు కప్పి, మొక్కలను అందజేసి వారి సేవలను అభినందించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, నీటి సరఫరా తదితర విభాగాల సమర్థ నిర్వహణలో ఉద్యోగులు అందించిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తమ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చిన ప్రతి ఉద్యోగి విఎంసి కుటుంబంలో విలువైన సభ్యుడని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సంతోషకరమైన జీవితం గడపాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడేలా వినియోగించాలని సూచించారు.మే నెలలో పదవీ విరమణ పొందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి. సామ్రాజ్యం, ఎస్. ప్రభాకరరావు, శానిటరీ మైస్త్రీ ఎం.ఎం. ఖురేష్, రికార్డ్ అసిస్టెంట్ డి.వై. విశ్వేశ్వరరావు, పీహెచ్ వర్కర్ కె. పేటూరు, మజ్దూర్ పి. రాముడు, హెల్పర్ ఎం. డేనియల్ లను ఈ సందర్భంగా సన్మానించారు.

## మధురానగర్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్"




విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మధురానగర్‌లో నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో అధికారులు కాలువల పరిశుభ్రత పనుల్లో పాల్గొని ఆదర్శంగా నిలిచారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, ఈఈ–2 గోపాలకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్ లు పని ముట్లు పట్టుకొని సైడ్ కాలువలు సిబ్బందితో కలిసి శుభ్రపరిచారు. మధురానగర్‌లోని ప్రధాన కాలువలు, అంతర్గత డ్రైన్లలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా, దోమల వ్యాప్తిని నివారించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ ఇన్చార్జ్ పి. సత్యకుమారి మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని, చెత్తను కాలువల్లో వేయకుండా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పారిశుధ్య వ్యవస్థను వినియోగించాలని అధికారులు కోరారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజారోగ్యం సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

బెంజ్ సర్కిల్ వద్ద పింక్ టాయిలెట్‌ను పరిశీలించిన ఎస్‌బీఎం డైరెక్టర్ సురభి మాలిక్ ఐఏఎస్




విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) డైరెక్టర్ సురభి మాలిక్, ఐఏఎస్ బుధవారం విజయవాడ నగరంలోని బెంజ్ సర్కిల్ వద్ద గల పింక్ టాయిలెట్‌ను సందర్శించి అక్కడ మహిళలకు అందుబాటులో ఉన్న ప్రత్యేక సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మహిళల పరిశుభ్రత, భద్రత, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలోని సదుపాయాలపై ఆమె వివరాలు తెలుసుకున్నారు.పింక్ టాయిలెట్‌లో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూమ్, శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషీన్, వినియోగించిన న్యాప్‌కిన్లను శాస్త్రీయంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఇన్సినిరేటర్, చేతులు శుభ్రం చేసుకునే హ్యాండ్‌వాష్ సదుపాయాలు, అద్దాలు (మిర్రర్స్), పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తదితర అంశాలను ఆమె పరిశీలించారు. మహిళలు, బాలింతలు, బాలికలకు అనుకూలంగా రూపొందించిన సౌకర్యాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సురభి మాలిక్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల్లో భాగంగా మహిళలకు గౌరవప్రదమైన, సురక్షితమైన, పరిశుభ్రమైన పారిశుధ్య సౌకర్యాలను అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో మహిళల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేస్తున్న పింక్ టాయిలెట్లు వారి ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతకు దోహదపడుతున్నాయని తెలిపారు.విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పింక్ టాయిలెట్ల నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాల అమలు, మహిళా అనుకూల సదుపాయాల కల్పన వంటి అంశాలను ఆమె అభినందించారు. ప్రజలకు నాణ్యమైన పారిశుధ్య సేవలు అందించడంలో నగరపాలక సంస్థలు మరింత కృషి చేయాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, అసిస్టెంట్ ఇంజనీర్ ఇంచార్జ్ చందు, స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## చెట్టు పడి ధ్వంసమైన ఇళ్ళను పరిశీలించిన ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– తూర్పులోని 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్ కరకట్ట కాలువ రోడ్డులో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వర్షానికి చెట్టు కూలి ఇళ్ళపై పడిన ప్రాంతాన్ని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ బుధవారం ఉదయం కార్పోరేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఈదురు గాలులు, వర్షం పడే సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లను స్థానికులు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే వాటి దగ్గర రక్షణ చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తానని చెప్పారు. కార్పొరేషన్ అధికారులు కూడా పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న చెట్ల దగ్గర రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్టు పడి దెబ్బతిన్న ఇళ్ళ వారికి ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని గద్దె హామీ ఇచ్చారు. వర్షం పడినప్పుడు కొండపై ప్రాంతాల్లో ఉంటున్న నివాసితులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదిరెడ్డి అమ్ములు, కెల్లా రమేష్ నాయుడు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, సత్యనారాయణ, వీఆర్వో హసీనా బేగం, తదితరలు పాల్గొన్నారు.

## విడో, వృద్ధాప్య పెన్షన్లతో అండగా నిలుస్తున్న బొండా కుటుంబం, ప్రజల కష్టాల్లో తోడుగా, అర్హులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న బొండా సిద్ధార్థ



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచనల మేరకు పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసంౣా–4 పథకం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి నాయకులు వివరించారు.తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ, బొండా రవితేజ, తమ సొంత నిధులతో ఇప్పటికే అనేక నిరుపేద కుటుంబాలకు తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, టిఫిన్ బండ్లు అందించి జీవనోపాధి కల్పించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్య కొనసాగించలేని విద్యార్థులను దత్తత తీసుకుని వారి విద్యా ఖర్చులను భరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈ సందర్భంగా 61వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త సంది పాముల దాసు మరణించడంతో ఆయన సతీమణి సంది పాముల రమాదేవి కి విడో పెన్షన్, 24వ డివిజన్‌కు చెందిన కంభంపాటి సావిత్రి కి విడో పెన్షన్, 61వ డివిజన్‌కు చెందిన ఎస్.డి. బషీరునిసాకి వృద్ధాప్య పెన్షన్, 60వ డివిజన్ వాంబే కాలనీకి చెందిన ఎస్.కె. బషీర్ కు బొండా ఉమా సూచన మేరకు బొండా సిద్ధార్థ 4,000 పెన్షన్‌ను అందజేశారు.అంతేకాకుండా అర్హులైన లబ్ధిదారులకు ప్రతినెలా తమ సొంత నిధులతో పెన్షన్ అందజేస్తామని హామీ ఇస్తూ, వారి కుటుంబాలకు భరోసా కల్పించారు. పెన్షన్ అందుకున్న కుటుంబ సభ్యులు బొండా కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావిస్తూ పేదలకు అండగా నిలవడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూతనివ్వడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించడం బొండా కుటుంబం సేవా ధ్యేయమని తెలిపారు.

## పార్టీని, ప్రభుత్వాన్ని ప్రజలకు మరింతగా చేరువ చేస్తాం

3వ డివిజన్ క్లస్టర్స్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– తెలుగుదేశం పార్టీని, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు పటిష్టమైన ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.బుధవారం ఉదయం తూర్పులోని 3వ డివిజన్ లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకొని, వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం డివిజన్‌లోని క్లస్టర్స్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో గణేష్ నగర్‌లోని కె.ఎస్.గ్రాండ్‌లో గద్దె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గద్దె మాట్లాడుతూ హైబ్రీడ్ విధానంలో జరిగిన మహానాడులో క్లస్టర్స్ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు లక్షల సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ఈ మహానాడును ఆన్‌లైన్ ద్వారా వీక్షించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్తగా నాయకత్వ లక్షణాలను పెంపోందిచుకున్నారని, టెక్నాలజీని అవగాహన చేసుకున్నారని చెప్పారు. హైబ్రీడ్ మహానాడు కొనసాగింపుగా పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక పార్టీ ప్రణాళికను (డైరీని) రాష్ట్ర కమిటీ విడుదల చేసిందని, అందులో భాగంగా ప్రతి నెలా మొదటి బుధవారం యూనిట్ కన్వీనర్ పరిధిలోని ఐదు బూత్ కమిటీలకు చెందిన వారు సమావేశమై స్థానికంగా ఉన్న అన్ని సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయాలన్నారు. రెండో బుధవారం డివిజన్ స్థాయిలోను, మూడో బుధవారం నియోజకవర్గ స్థాయిలోను సమావేశం నిర్వహించాలని, నాలుగో బుధవారం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించాలని రాష్ట్ర కమిటీ ప్రణాళికను రూపొందించిందని తెలిపారు. ఈ విధమైన సమావేశాల వల్ల స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించడమే కాకుండా పార్టీని మరింతగా పటిష్ట పరచుకునేందుకు అవకాశం లభిస్తుందని చెప్పారు. అంతేకాకుండా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందచేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని ఆ దిశగానే అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడి బాబూరావు, గద్దె రమేష్, పేరేపి ఈశ్వర్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, యలమంచిలి పండు, పాశం కృష్ణబాబు, జంగం సునీల్‌రాజు, గుంజా ఏసు, రాగాని సాయి, దాసరి రమేష్, గొల్లపల్లి శంకర్, దాసరి శంకర్, కొండపనేని శ్రీను, మల్లిపెద్ది ఝాన్సీ, అట్లూరి వసంత్, బంగారు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## 1వ డివిజన్‌లో 16,కే 77కే నూతన బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా




విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– 1వ డివిజన్ ఐఆర్ఆర్–2 ఫ్లైఓవర్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ బంక్ పక్కన ఉన్న బస్టాప్ వద్ద ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే దిశగా మరో కీలక ముందడుగు పడింది.స్థానిక ప్రజల చిరకాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసి రాజీవ్‌నగర్, కండ్రిక, క్రీస్తురాజుపురం, కాళేశ్వరరావు మార్కెట్, రామవరప్పాడు, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలకు ఎంతో ఉపయోగపడే 16ఖ, 77ఖ నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే బొండా ఉమా జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉమా గారు మాట్లాడుతూ 2024లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం "ప్రజా దర్బార్" నిర్వహిస్తూ వచ్చిన ప్రతి అర్జీని అధికారుల సమక్షంలో నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఉమా అన్నారు.డివిజన్ పర్యటనల ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామని, షిరిడి సాయినగర్, ప్రశాంత్ కాలనీ, ఎస్ఎల్వీ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో దాదాపు 13 వేల మంది నివసిస్తున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామని, దేవీనగర్ ట్రెండ్‌సెట్ ప్రాంతం నుంచి నేరుగా రహదారి నిర్మాణం చేపట్టడం ద్వారా బీసెంట్ రోడ్, సింగ్‌నగర్ తదితర ప్రాంతాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించామని ఉమా తెలిపారు. అదేవిధంగా స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, రూ.33 కోట్లతో డ్రైనేజీ పనుల ప్రారంభం, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఇటీవల స్థానికులతో నిర్వహించిన సమావేశంలో బస్సు సౌకర్యం, స్ట్రీట్ లైట్లు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై వచ్చిన విజ్ఞప్తులను వెంటనే అమలు చేశామని ఉమా తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆర్టీసీ అధికారులతో చర్చించి ఈ నూతన బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు.ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇదే బాధ్యతతో ప్రజాసేవ కొనసాగిస్తామని, ఈ నూతన బస్సు సర్వీసులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమా కోరారు. ఈ కార్యక్రమంలో టి. పి. రంగబాబు, టి. అమ్మాజీ, లక్ష్మీనారాయణ, ఎస్.ఎల్.వి.–2 సాయి, జె. సత్యనారాయణ, బి. రామ్ ప్రసాద్, గొంది వెంకటేశ్వరరావు, కొలన శ్రీనివాసరావు, ఉన్నం వెంకటేశ్వరరావు, మారం రెడ్డి సుబ్బారావు, కొమ్మినేని సురేష్, నాని, పరుచూరి భార్గవ్, దివ్య, సత్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

: విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):– ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం విఎంసి ప్రధాన కార్యాలయం ముందు ఉన్న నర్సరీ వద్ద ఎస్ఎన్జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మజ్జిగ పంపిణీ, మొక్కల నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు దోహదపడే మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అలాగే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలపై స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేసినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎన్జీ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి కందుల శారదా వాణి ప్రసాద్, సభ్యులు వంశీ, తోట ఆదిత్య విజయ్ రాజ్, షేక్ భాషా, వల్లభనేని వాణి, షేక్ చాంద్, పద్మజ, షా న్యూస్ ప్రతినిధి హుమాయూన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఓ.సిలను అందచేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):- విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎల్.ఓ.సీలను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు.మైలవరం పరిధిలోని నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.5,04,534ల విలువైన ఎల్.ఓ.సిలు మంజూరయ్యాయి.రెడ్డిగూడెం మండలంలోని కూనపరాజుపర్వకు చెందిన గుత్తి జమలమ్మకు రూ.1,25,000లు, ఇబ్రహీంపట్నంకు చెందిన పులి అరుణ కుమారికి రూ.1,29,709లు, గొల్లపూడికి చెందిన తమిరిసి విజయలక్ష్మికి రూ.75,016లు, రెడ్డిగూడెంకు చెందిన కట్ట సీతమ్మకు అత్యధికంగా రూ.1,74,809లు ఎల్.ఓ.సిలు మంజూరయ్యాయి.వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఈ ఎల్.ఓ.సిలను ఎమ్మెల్యే ఆందజేసారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వసంత పేర్కొన్నారు.సీఎం సహాయనిధి ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్నవారికి సీఎం చంద్రబాబు , కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.అర్జీ పెట్టుకున్న వెంటనే ఎల్.ఓ.సిలు మంజూరు చేయిస్తున్నామని వివరించారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ఎజెండా

### ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):- విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బారులో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు సేవలు అందించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలు ఇచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని, ఏదైనా కారణాల వల్ల పరిష్కారం ఆలస్యమైతే అందుకు గల కారణాలను ప్రజలకు వివరించాలని అన్నారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలను ఆత్మీయంగా పలకరించడం ద్వారా వారి సమస్యలను అర్థం చేసుకోవచ్చని, మన పలకరింపుతోనే వారి సమస్యలు సగం పరిష్కారమైన భావన కలుగుతుందని కృష్ణప్రసాదు పేర్కొన్నారు.సచివాలయాల సిబ్బంది నిర్ణీత సమయానికి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల స్థాయి అధికారులు సచివాలయాల పనితీరును బాధ్యతతో పర్యవేక్షించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వసంత కృష్ణప్రసాదు సూచించారు.

## వైసీపీ నాయకులు అవగాహన పెంచుకోవాలి

### మెరుగైన నీటి సరఫరా వ్యవస్థను అమలు చేస్తున్నాం

### పడవల రేవు సెంటర్‌లో నీటి పైప్ లైన్ అంశంపై ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):- నీటి సరఫరా వ్యవస్థపై వైఎస్సార్‌సీపీ నాయకులు అవగాహన పెంచుకుని మాట్లాడితే బాగుంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. బుధవారం సాయంత్రం తూర్పు లోని 3వ డివిజన్ గణేష్‌నగర్‌లో ఉన్న కెఎస్. గ్రాండ్‌లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కొండ ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్‌లను నిర్మాణం చేసి కొండపై ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి కూడా తాగునీటిని అందించామన్నారు. మధురానగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేసే సమయంలోనే గంగిరెద్దుల దిబ్బ దగ్గర ట్యాంక్ మెయిన్ పైప్‌లైన్ నుంచి మధురానగర్‌లో ట్యాంక్‌కు నీటిని అందించాలని అప్పడే కౌన్సిల్‌లో నిర్ణయించారన్నారు. దాని ప్రకారమే ఏలూరురోడ్డులోని మెయిన్ లైన్‌కు కలుపుతున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పోరేటర్లు కౌన్సిల్‌లో ఆమోదించి ఇప్పుడు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏలూరు రోడ్డులో ప్రధాన పైప్‌లైన్ నిర్మాణం చేస్తున్నప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులు ఏమీ చేశారన్నారు. రిటైనింగ్ వాల్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనేక సార్లు స్వయంగా వచ్చి పరిశీలించి నిర్మాణం చేశారని, దాని కూడా తామే నిర్మాణం చేశామని వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పుకుని నాటకాలు ఆడారన్నారు. భవానీపురంలోని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి అన్ని నియోజకవర్గాలకు నీరు సరఫరా చేస్తారని, పశ్చిమ నియోజవర్గం నుంచి నీరు ఇవ్వమని అక్కడి వారు అంటే పరిస్థితి ఏమిటన్నారు. క్రీస్తురాజపురంలో నిర్మాణం చేసే ట్యాంక్‌నకు కూడా గంగిరెద్దుల దిబ్బ ట్యాంక్ నుంచే నీటిని అందిస్తారన్నారు. నగర ప్రజలకు నీటిని నిరంతరాయంగా సరఫరా చేసేందుకు ట్యాంక్‌ల నిర్మాణం జరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మెయిన్ లైన్‌కు, కొండ ప్రాంతాలకు నీటి సరఫరా చేసే పైప్‌లైన్‌కు వేర్వేరుగా ఉంటాయని ఈ విషయాలపై కనీస అవగాహన లేకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. కొండ ప్రాంత వాసులకు మెరుగైన విధానంలో నీటిని సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నగరంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను ఇబ్బంది పెట్టే రాజకీయాలు చేయవద్దని, అవగాహన పెంచుకుని రాజకీయాలు చేస్తే మంచిందని వైఎస్సార్‌సీపీ నాయకులకు గద్దె చెప్పారు. జనసేన నాయకుడు కృష్ణమోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై కావాలనే వైఎస్సార్‌సీపీ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. కొండ ప్రాంతాల్లో ప్రజల దాహర్తిని తీర్చడానికి ఎమ్మెల్యే గద్దె ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేశారని, అలాంటి గద్దె పై వైఎస్సార్‌సీపీ నాయకులు లేనిపోని అవాస్తవాలు చెబితే సహించమని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడి బాబూరావు, దాసరి గాబ్రియేల్, పడాల గంగాధర్, గద్దె రమేష్, పేరేపి ఈశ్వర్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, సుగసాని రత్నశ్రీ, గుత్తికొండ కృష్ణమోహన్, యలమంచిలి పండు, ముత్యాల కృష్ణ, బండి సాయి కోమలి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన బిజెపి రాష్ట్ర నేత కేఎన్ఆర్



( నేటి శుభోదయ జూన్ : 04 జగన్ విశాఖపట్నం జిల్లా గాజువాక గంగవరం మండలం 64వ వార్డులో పెద్దపల్లిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని బిజెపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ నియోజకవర్గం ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్). సందర్శించారు. మండల ఇంచార్జ్ గరికిన పైడిరాజు వార్డు అధ్యక్షురాలు మాధవి ఆధ్వర్యంలో మండల పర్యటన చేపట్టారు. అంగన్వాడీ టీచర్ దేవుడమ్మని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో 30 మంది పిల్లలకు ఇక్కడ ఉచిత చదువు మధ్యాహ్నం భోజనం, పుస్తకాలు, బ్యాగులు, గర్భినీ స్త్రీ లకు పాలు గుడ్లు వంటి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అన్నారు.



అంగన్వాడీ కేంద్రం యొక్క ద్వారబంధం తలుపులు పుచ్చిపోయాయని టీచర్ దేవుడమ్మ కేఎన్ఆర్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన వెంటనే స్థానిక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రామకృష్ణ,దేవుడు,జగన్నాథం,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం జిల్లా సిటీ పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి వారి చేతుల మీదగా

### విశాఖపట్నం అన్ ఆర్గనైసేడ్ వర్కర్స్ యూనియన్ పోస్టర్ ఆవిష్కరణ...



( నేటి శుభోదయ జూన్ : 04 జగన్ ) విశాఖపట్నం ఆన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ యూనియన్ వారు విశాఖపట్నం జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ సి పి శంక బ్రత బాగ్చి . వారిని మర్యాదపూర్వకంగా కలిసి విశాఖపట్నం అన్ ఆర్గనైజేడ్ వర్కర్స్ యూనియన్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది అదే సమయంలో యూనియన్ అధ్యక్షులు మధుబాబు మాట్లాడుతూ యూనియన్ పెట్టడానికి గల ముఖ్య కారణం ఉపాధి లేని యువతకి ఉపాధి కలిగేలా చేయడం మరియు కార్మికులకు అండగా ఉంటూ కంపెనీలో కార్మిక చట్టాలు అమలయ్యేలా చేయడం కార్మికులు ఎటువంటి సమస్యలు వచ్చిన పరిష్కరించినందుకు లీగల్ సెల్ కూడా ఏర్పాటు చేయడం జరిగింది అలాగే సెంట్రల్ గవర్నమెంట్ నుంచి మరియు స్టేట్ గవర్నమెంట్ నుంచి లేబర్స్ కి వచ్చే పథకాలు స్కీములు వాటి మీద అవగాహన ఇచ్చి వారికి ఆ పథకాలు అందేలా చేయడం ఈ యూనియన్ ఒక ముఖ్య కారణం


## రోడ్డు ప్రమాద బాధితుడుకి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా ఆర్థిక సహాయం



బాపట్ల నేటి శుభోదయజూన్ 3:కర్లపాలెం రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి అన్నారు.కర్లపాలెం మండలం తిమ్మారెడ్డిపాలెం కు చెందిన శవనం శివ నాగేందర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయి గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడి కుటుంబ సభ్యులకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయం అందజెచేశారు. ఈ సందర్భంగా బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ వివిధ కారణాలతో అనేక రకాల ఇబ్బందులు పడుతున్న పేదలకు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. తిమ్మారెడ్డి పాలెం కు చెందిన శివ నాగేందర్ రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో బాధితుడికి హార్దిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరడంతో తమ సభ్యుల ఆదేశాలతో రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం అందజేసి కొంతమేర ధైర్యాన్ని నింపామని చెప్పారు. వివిధ సంఘాల దాతలు స్పందించి బాధితుడికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులు బుగ్గవరపు శివకుమార్, కార్యదర్శి బత్తుల సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, ఇనపగోళ్ళ రంగారావు, పెద్దమలు శ్రీకాంత్, నరాలశెట్టి నాగరాజు,బండ్రెడ్డి అంకమ్మరావు,నందిపాటి శ్రీరామ సునీల్, కొత్త మల్లికార్జునరావు, విన్నకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో బుధవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా ప్రారంభించిన

### "లలిత పి.వి.ఎస్. ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్" హాస్పిటల్.



బాపట్ల నేటి శుభోదయజూన్ 3 : ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , లోక్ సభ ప్యానల్ స్పీకర్ మరియు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, 40కి పైగా క్లినికల్ విభాగాలు, సరికొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో కూడిన వైద్య పరికరాలను పరిశీలించారు.

## చందోలు ఎస్సైగా కే. మాధవరావు బాధ్యతల స్వీకరణ




బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) జూన్ 3:పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా కే. మాధవరావు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కే. మాధవరావు మాట్లాడుతూ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, చట్ట విరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో చందోలు పరిధిలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## పవన్ కళ్యాణ్ ముందు ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు కోసం పోరాడండి..

### ప్రియాంక దండి.



( నేటి శుభోదయ జూన్ : 04 జగన్ విశాఖపట్నం ) తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున జనసేన హైదరాబాద్ లో బహిరంగ సభ పెట్టడానికి పోలీస్ శాఖకు అనుమతి కోరిందని, పోలీసులు అనుమతి నిరాకరించడంతో అసహనంతో కాంగ్రెస్ ప్రభుత్వం పై మరియు పార్టీ నాయకుల పై విమర్శలు గుప్పించారని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆరోపించారు. సభకు అనుమతి కోరుతూ జనసేన హై కోర్టుని ఆశ్రయించిన అక్కడ కూడ నిరాసే ఎదురైందని, తెలంగాణలో ఉన్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యమకారులు సైతం తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం శాంతియుతంగా జరుపుకుంటే జనసేన బహిరంగ సభ నిర్వహించి ఏం చెప్పాలనుకుందని ఆమె ప్రశ్నించారు. బీజేపీ పెద్దల దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని తెలంగాణలో విద్వేషాలు రెచ్చగొట్టి రెండు తెలుగు రాష్ట్రాలలో చిచ్చు పెట్టే ప్రయత్నానికి తెర లేపారని ప్రియాంక అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసారు, విశాఖ స్టీల్ ప్లాంట్ ని చంపేయాలని చూస్తున్నారు, మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఇంతవరకు మొదలు కాలేదు, విభజన హామీల్లో చాలా వరకు అమలు కాలేదు, ఆంధ్రప్రదేశ్ కి ఉప ముఖ్యమంత్రిగా ఉంటూ మన రాష్ట్రానికి కేంద్రం ఇంత అన్యాయం చేస్తుంటే అది వదిలి తెలంగాణ వెళ్లి పవన్ కళ్యాణ్ ఏది సాదించాలనుకున్నారో అర్థం కాలేదని ప్రియాంక అన్నారు.పవన్ కళ్యాణ్ కి చిత్తశుద్ధి ఉంటే ఆంధ్రప్రదేశ్ కి రావాల్సిన విభజన హక్కులు ముందు సాధించి అప్పుడు దేశమంతా పోటీ చేయవచ్చని ప్రియాంక అన్నారు.

## బడి పిలుస్తుంది - మన అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమం విజయవంతం




( నేటి శుభోదయ జూన్ : 04 జగన్ విశాఖపట్నం ) ములగాడ మండలంలో నిర్వహిస్తున్న "బడి పిలుస్తుంది" మరియు "మన అంగన్వాడీ పిలుస్తుంది" కార్యక్రమాలలో భాగంగా మండల స్పెషల్ ఆఫీసర్, డబ్ల్యూడి, సిడబ్ల్యూ, ఈవో, వి.ఎస్.పి. కె.వి. రామలక్ష్మి, సీడీపీఓ కె. నీలిమ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్వైజర్ సత్యవతి మరియు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. అందరూ కలిసి మల్కాపురం వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి, బడీడు పిల్లలు మరియు అంగన్వాడీ వయస్సు పిల్లలను గుర్తించారు.అనంతరం తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించి, అర్హులైన పిల్లలకు పాఠశాలల్లో మరియు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) సభ్యులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పిల్లలందరూ విద్యను అభ్యసించి ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని అధికారులు ఆకాంక్షించారు.






## రైతు కుటుంబానికి రూ.1 లక్ష భీమా చెక్కు అందజేత



ఖమ్మం, ముదిగొండ, నేటి శుభోదయ ::: ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి చెందిన రైతు మహిళ యర్రా స్వరూప ఇటీవల మరణించగా ఆమె కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ముదిగొండ సొసైటీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.1 లక్ష భీమా చెక్కును ఆమె భర్త యర్రా సీతారామరావుకు ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకు యలగొండ స్వామి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబాలకు సహకార సంఘాలు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పిస్తున్నాయని ఆయన తెలిపారు. రైతు కుటుంబానికి భీమా సాయం అందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో ప్రసాద్, సిబ్బంది దీపిక, లక్ష్మయ్య, శ్రీను, జానీమియా, మధు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం ట్రాఫిక్ సమస్య కు
# ఎంపీ కేశినేని చిన్ని శాశ్వత పరిష్కారం

**ఎన్ హెచ్-30 విస్తరణకు ఆమోదం తెలిపిన ఎన్ హెచ్ ఏ ఐ**



విజయవాడ, జూన్ 3 (నేటి శుభోదయ):- తిరువూరు (ఏ కొండూరు మండలం, రామచంద్రపురం)ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషికి ఫలితం దక్కింది. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న తిరువూరు--ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిలోని రామచంద్రాపురం ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. ఎంపీ చిన్ని ప్రత్యేక చొరవ, నిరంతర అనుసరణ ఫలితంగా జాతీయ రహదారి-30 విస్తరణకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారిక ఆమోదం తెలిపింది.సుమారు రూ.24 కోట్ల వ్యయంతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణంతో పాటు ఇరువైపులా సర్వీస్ రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. దీంతో రోజువారీ ట్రాఫిక్ రద్దీకి చెక్ పడటమే కాకుండా వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలకు భారీ ఊరట లభించనుంది.రామచంద్రాపురం వద్ద రహదారి వెడల్పు లేకపోవడం, పెరిగిన వాహన రద్దీ కారణంగా గత కొన్నేళ్లుగా తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది. కేవలం ఒక కిలోమీటర్ ప్రయాణానికి సైతం 20 నిమిషాలకుపైగా సమయం పట్టే పరిస్థితి ఉండేది. ప్రజల నుంచి వచ్చిన వినతులను సీరియస్‌గా తీసుకున్న ఎంపీ చిన్ని ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై పలుమార్లు ఉన్నతాధికారులతో సమావేశమై రహదారి విస్తరణ అత్యవసరతను వివరించడంతో పాటు, ప్రతిపాదనకు వేగంగా ఆమోదం లభించేలా ఢిల్లీలోనూ, స్థానిక స్థాయిలోనూ నిరంతరం అనుసరణ కొనసాగించారు. సాంకేతిక, పరిపాలనా అడ్డంకులను అధిగమిస్తూ ప్రాజెక్టుకు ఆమోదం వచ్చే వరకు పట్టుదలతో కృషి చేశారు.ప్రజల అవసరాలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడంలో ఎంపీ చూపుతున్న చొరవకు ఇది మరో నిదర్శనంగా స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పూర్తయిన తర్వాత ఎన్ హెచ్ 30 పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా కానుంది.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ "ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధాన బాధ్యత అనీ, రామచంద్రాపురం ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించడం సంతోషంగా ఉందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తాననీ, ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందేలా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువస్తాం" అని చిన్ని తెలిపారు.ప్రజల కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా చిన్ని మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు తిరువూరు, మైలవరం నియోజకవర్గాల ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం నిత్యం విజయవాడకు రాకపోకలు సాగించేది ఈ ప్రధాన రహదారిపైనే. అయితే రామచంద్రాపురం వద్ద ఏర్పడే ట్రాఫిక్ సమస్య కారణంగా దశాబ్దాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సిన పరిస్థితి నెలకొనేది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చిన్ని తీసుకున్న ప్రత్యేక చొరవ ఫలించి రహదారి విస్తరణకు ఆమోదం లభించడంతో తిరువూరు, మైలవరం ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తమ సమస్యకు పరిష్కార మార్గం చూపిన ఎంపీ పట్ల స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు."ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి పట్టుదలతో కృషి చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో రామచంద్రాపురం రహదారి విస్తరణ ఆమోదమే నిదర్శనమని స్థానికులు తెలిపారు."

## మౌనం వెనుక మర్మం ఏమిటో యదేచ్ఛగా కన్వేషన్ సెంటర్లు

**- మట్టి, ల్యాండ్ మాఫియా పై చర్యలు లేవి....**

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో ఏ మూలన చూసిన మట్టి, ల్యాండ్ మాఫియా రెచ్చిపోతున్న ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ల్యాండ్ మాఫియా, మట్టి మాఫియా కు ఎవరూ వత్తాసు పలుకుతున్నారు అనే అనుమానం కలగమానదు. ఈ మాఫియా వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరు వారికి, వీరికి సంబంధం ఏమిటి అనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. రఘునాథపాలెం మండలంలో మట్టి గుట్టలకు గుండు కొట్టిస్తున్న మట్టి మాఫియా వెనుక ఉన్న రహస్య హస్తాలు ఎవరివి వందల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నట్లు వస్తున్న ఆరోపణల వెనుక నిజమెంత? అనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. ఎన్ ఎస్ పి భూములు యథేచ్ఛగా ఆక్రమించి కన్వేషన్ సెంటర్లు, వ్యాపార సముదాయాలు, గృహ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఎవరి ఒత్తిళ్ళు పని చేస్తున్నాయి అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. గత ఎన్నికల ప్రచారం సందర్భంగా ల్యాండ్ మాఫియా,మట్టి మాఫియాపై నిప్పులు చెరిగిన నేటి అధికార పార్టీ నాయకులు ప్రస్తుతం మౌనం దాల్చడం వెనుక మర్మం ఏమిటి అనే అనుమానం కలుగుతోంది. మౌనం వెనుక మర్మం ఏదో ఉంటుంది అని తెలుస్తోంది. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చిన నేతలు నేడు మాట మార్చిన సందర్భాలు లేకపోలేదు. ఏదో న్యూస్ మీడియా లో రెండు, మూడు రోజులు చర్చ ఉంటుంది తర్వాత ఇదే జనం రోజులు గడుస్తున్నా కొద్దిగా మరిచిపోవడం షరా మామూలే అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధించిన పలు శాఖల అధికారులు సర్వే నిర్వహించి అక్రమాలు నిజమే అని తెల్సినా సంబంధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే మీనా మీసాలు లెక్కిస్తున్నారు. చర్యలు తీసుకొని పక్షంలో సంబంధించిన మంత్రుల పై జిల్లా ప్రజలకు నమ్మకం కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి. అవసరం అయితే అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను అడ్డుకొని తక్షణమే కూల్చి వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి. హైదరాబాద్ లాంటి నగరాల్లో హైడ్రా పేరుతో పెద్ద పెద్ద భవనాలను కూల్చి వేసిన సందర్భం లేకపోలేదు. మరి అధికారులు, మంత్రులు ఏమి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

## మండలి వెంకటకృష్ణారావు
## శత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాల్గొనడం



బాపట్ల నేటి శుభోదయజూన్ 3:బాపట్ల టౌన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సౌజన్యంతో, ధృతి సాహిత్య సాంస్కృతిక సామాజిక సంస్థ బాపట్ల ఆధ్వర్యంలో శ్రీ మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా అరవింద ఆర్ట్స్, తాడేపల్లి వారి ఆధ్వర్యంలో, గంగోత్రి సాయి దర్శకత్వంలో, డా. దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన "మహా పురుషుడు మండలి" నాటకం ప్రదర్శించబడింది. ఈ సాంస్కృతిక కార్యక్రమానికి అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొని నాటక ప్రదర్శనను వీక్షించారు. ఈ సందర్భంగా మండలి వెంకటకృష్ణారావు తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య రంగాలకు అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆదర్శాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సాహిత్య, సాంస్కృతిక విలువలను పరిరక్షించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. కార్యక్రమంలో కళ్ళం హరినాద్ రెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, అంబటి మురళి, శీలం శ్రీనివాసరావు,సాహితీవేత్తలు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అధికారుల నోటీసులు ఎన్ని నోటీసులు ఇస్తే మాకెందుకు బెంగ అర్చనమ్మ అండ ఉండగా

**ఏసీపీ ప్రతాప్ వైఖరిపై ఎన్ని విమర్శలు వచ్చిన మాకేం పట్టింపు లేదు.టీపీఎస్ అర్చన అమ్మ చల్లని చూపులు మాపై ఉంటే ఎంత పెద్దదైన అక్రమ నిర్మాణాలు చేసుకోవచ్చు.ప్రజా ఫిర్యాదు చేస్తే మాకేం పని అనే ధోరణిలో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం.**



ఎల్బీనగర్,జూన్ 3(నేటి శుభోదయ):టిపిఎస్ అధికారి అర్చన అమ్మ అండదండలతో విక్రమార్కులకు ఎంతో హ్యాపీగా సాగుతున్న అక్రమ నిర్మాణాల దందా.అందులో భాగంగానే ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని బీడీ రెడ్డి గార్డెన్ నుండి నంది హిల్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ అక్రమ షెడ్ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ,అధికారులు కేవలం నోటీసులు జారీ చేయడానికే పరిమితమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు.అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరిస్తున్న తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది.నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతున్నప్పటికీ,పనులు మాత్రం యథావిధిగా కొనసాగుతుండటం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.నోటీసులు జారీ చేయడం ఒకవైపు,నిర్మాణం కొనసాగడం మరోవైపు ఉండటంతో అవి కేవలం తూతూ మంత్రంగా మారిపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.డిప్యూటీ కమిషనర్ భువనగిరి శ్రీనివాస్,ఏసీపీ ప్రతాప్,టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ అర్చన,చైన్‌మెన్ సత్యనారాయణల పర్యవేక్షణలోనే ఈ ప్రాంతం ఉండగా ఇంత పెద్ద నిర్మాణం ఎలా జరుగుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ముఖ్యంగా ఏసీపీ ప్రతాప్ వ్యవహారం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని,ఫిర్యాదులపై స్పందన లేకపోవడం వల్ల అక్రమ నిర్మాణదారులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు.టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ అర్చనపై కూడా స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.సెక్షన్ ఆఫీసర్ అర్చన ఆశీర్వాదం ఉంటే చాలు ఎన్ని అక్రమ నిర్మాణాలైనా చేసుకోవచ్చు అనే వ్యాఖ్యలు ప్రజల మధ్య వినిపిస్తున్నాయి.అధికారుల నిర్లక్ష్యమా.? లేక లంచాలే కారణమా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ మున్సిపల్ నియమ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నప్పటికీ,క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందినంత దోచుకోవడమేనా డ్యూటీ..అందినంత అందుకో దొరికినంత పుచ్చుకో అన్న ధోరణిలో ఎల్బీనగర్ సర్కిల్ లో కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో మున్సిపల్ శాఖ పై ప్రజల విశ్వాసం పూర్తిగా దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణలో భూముల ధరలు పెంపు..జూన్ 5 నుంచి అమల్లోకి



హైదరాబాద్, రాజేంద్రనగర్, జూన్ 3(నేటి శుభోదయ): తెలంగాణలో సవరించిన భూముల ధరలు జూన్ 5 నుంచి అమల్లోకి రానున్నాయి.భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ధరలను సవరిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.భూముల విలువల సవరణను శాస్త్రీయంగా,హేతుబద్ధంగా చేపట్టినట్లు పేర్కొన్నారు.ఆర్థిక నిపుణులు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక మేరకు ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయిలో అధ్యయనం నిర్వహించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వివరించారు.ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు,రిజిస్ట్రేషన్లు,ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి సమగ్ర కసరత్తు లేకుండా..అశాస్త్రీయ పద్ధతుల్లో 2021-22 సంవత్సరాల్లో కేవలం 6 నెలల వ్యవధిలోనే రెండు సార్లు భూముల ధరలను పెంచడంతో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని మంత్రి పొంగులేటి గుర్తుచేశారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన సవరణలు క్షేత్రస్థాయి అధ్యయనం లేకుండా కేవలం శాతం గణనల ఆధారంగా,పట్టికల ప్రకారం చేపట్టడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా,మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా విలువలు నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.వాస్తవ మార్కెట్ ధరలకు..ప్రభుత్వ విలువలకు మధ్య భారీ అంతరం ఉండటం వల్ల భూ లావాదేవీలలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని..ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని అన్ని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల (ఎస్ ఆర్ ఓ)పరిధిలో మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.గ్రామీణ,పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను పరిశీలించి సవరించిన విలువలను రూపొందించి ఆమోదించాయని పేర్కొన్నారు.ఇక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా..

వాస్తవ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా,పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఈ సవరణలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి,భూ లావాదేవీలలో పారదర్శకత పెంపునకు,ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు.

# గ్రామ,వార్డు సభల నిర్వహణపై సమీక్ష

**అధికారులకు దిశానిర్దేశం చేసిన అదనపు కలెక్టర్లు**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ జూన్ 03 నేటి శుభోదయ :ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4,6,8,10వ తేదీలలో పంచాయతీల్లో గ్రామ సభలు,మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.మండల ప్రత్యేక అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,ఎంపీడీఓలు,తహసిల్దార్లు,ఎం.పీ.ఓలు,వివిధ శాఖల అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు గ్రామ,వార్డు సభల నిర్వహణకు సంబంధించి పాటించాల్సిన విధి,విధానాలు,ప్రస్తావించాల్సిన అంశాలు,ప్రజలకు విశదపర్చాల్సిన విషయాలు,ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం గురించి అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్,భుజంగరావు దిశానిర్దేశం చేశారు.గ్రామ,వార్డు సభలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ,పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా ప్రణాళికాబద్దంగా కృషి చేయాలని అన్నారు.సభ నిర్వహణకు ఒకరోజు ముందే టాంటాం ద్వారా,ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తుగానే సమాచారం తెలియజేయాలని తెలిపారు.పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ గురించి సభలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ,ఈ కార్యక్రమానికి




సహకరించాల్సిందిగా కోరాలని సూచించారు.ఎస్.ఐ.ఆర్ అమలులో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర క్రియాశీలకం అయినందున రాజకీయ పార్టీలు సత్వరమే బీ.ఎల్.ఏలను నియమించుకుని నిర్దేశిత నమూనాలో జాబితాను సమర్పించేలా ప్రజాప్రతినిధులను కోరాలని అన్నారు.ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు,విత్తనాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన దరిమిలా పంటల మార్పిడి ఆవశ్యకత గురించి రైతులకు తెలియజేయాలని,వర్షపు నీటి నిలువ,పొదుపుగా సాగు జలాల వినియోగం,అవసరం మేరకే ఎరువులు,క్రిమిసంహారక మందుల వాడకంపై అవగాహన కల్పించాలని హితవు పలికారు.పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి,వాటిని సంరక్షించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పాలని, ప్రకృతి సమతుల్యత కోసం అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు.అనుకోని రీతిలో ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆపదమిత్ర వాలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవడం, ఎవరికైనా విపత్తుల వల్ల నష్టం సంభవిస్తే ఆయా పథకాల ద్వారా ప్రభుత్వాలు అందించే నష్టపరిహారం గురించి సభలలో తెలియజేయాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత,తడి,పొడి చెత్త నిర్వహణ,ప్లాస్టిక్ వినియోగం నియంత్రణపై ప్రజల్లో అవగాహనను పెంపొందించాలని, వాల్టా, వన్యప్రాణి సంరక్షణ చట్టాల గురించి తెలియజేయాలని సూచించారు. రక్షిత మంచినీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ,సానిటేషన్ వంటి వాటి కోసం ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరిస్తూ,వారి నుండి వచ్చే ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరిస్తూ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములయ్యేలా చూడాలని,రహ్ వీర్ వంటి పథకాల గురించి వారికి విశదపర్చాలని అన్నారు.ఆపద్బంధు,జాతీయ కుటుంబ ప్రయోజన పథకం వంటి వాటిని అర్హులైన వారి సద్వినియోగం చేసుకునేలా ఆయా పథకాల గురించి అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని సూచించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకం గురించి,రెండవ విడత ఇళ్ళ మంజూరీ ప్రక్రియ గురించి సభలలో వివరించాలని అన్నారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ,గ్రామ,వార్డు సభల విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు.ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే,డీ.ఆర్.ఓ గీత,డీ.ఎఫ్.ఓ సిద్దార్ధ్ విక్రమ్ సింగ్,డీ.ఆర్.డీ.ఓ సాయన్న,జెడ్పీ సీ.ఈ.ఓ సాయగౌడ్,నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,నిజామాబాద్,బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్,విజయలక్ష్మి,అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# బ్లాక్ డ్రెస్‌లో మీనాక్షి చౌదరి అందాల మాయ





గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్‌డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినీ సెల్రబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసాగుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో ప్రారంభించారు. ఆ తరువాత 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు అమ్మడికి మంచి విజయాన్ని ఇచ్చాయి. గ్లామర్‌తో పాటు పెర్ఫార్మెన్స్ పరంగా కూడా మెప్పించే రోల్స్ కోసం ప్రయత్నిస్తున్న ఆమెకు ఇది కచ్చితంగా ప్లస్ అవుతుంది. ఈ తరహా ఫోటోషూట్లు ఆమెకు యూత్‌లో క్రేజ్ పెంచడమే కాకుండా, దర్శకుల దృష్టిని కూడా ఆకర్షిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

# 'స్పైడర్' ఫెయిల్.. ఎప్పుడూ లేనంత బాధ అనుభవించా




ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న రకుల్ ప్రీత్‌సింగ్ ఒకప్పుడు మన టాలీవుడ్ స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. మన హీరోల్లో ఉండే ప్రత్యేకతలను వెల్లడించారు. తనకు గుర్తింపు రావడానికి తెలుగు సినిమానే కారణమన్నారు. అలాగే తన కెరీర్‌లో 'స్పైడర్' ఊహించని అనుభవాన్ని ఇచ్చిందన్నారు. "నేను టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించాను. వరుసగా 8,9 హిట్స్ వచ్చాయి. కానీ, 'స్పైడర్' ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. అంచనాలు తారుమారైనప్పుడు ఎంత బాధ ఉంటుందో ఆ సినిమాతో అనుభవించాను. దాన్ని ఒక పాఠంగా భావించాను" అని రకుల్ తెలిపారు. అప్పటి నుంచి స్క్రిప్ట్ ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మన హీరోల గురించి రకుల్ ఏమన్నారంటే..

"ఎన్టీఆర్: సహజ నటుడు. మంచి డ్యాన్సర్. ఆయనకు రిహార్సల్స్ చేయాల్సిన అవసరం లేదు. ఎంత కష్టమైన స్టెప్ అయినా క్షణాల్లో నేర్చుకుంటారు. అల్లు అర్జున్: బన్నీ ఎప్పుడూ తెలుగు ఇండస్ట్రీని ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలని ఆలోచిస్తూ ఉంటారు. టీమ్ వర్క్‌ను ప్రోత్సహిస్తారు. అది చాలా గొప్ప లక్షణం.

రామ్ చరణ్: ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం. సెట్‌లో సరదాగా ఉంటారు. పెద్ద స్టార్ అయినప్పటికీ అందరితో సరదాగా ఉంటారు. మహేశ్ బాబు: మహేశ్ కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. పిల్లలతో ఆయన వ్యవహరించే తీరే ఆయనేంటనేది చెబుతుంది. మనసున్న మనిషి. ఫ్యామిలీని, కెరీర్‌ను రెండింటినీ చక్కగా బ్యాలెన్స్ చేస్తారు" అని రకుల్ పంచుకుంది. ఈ హీరోలందరితో రకుల్ నటించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్‌తో కలిసి 'నాన్నకు ప్రేమతో'లో కనిపించారు. అల్లు అర్జున్ సరసన 'సరైనోడు'తో మెప్పించారు. రామ్ చరణ్ సరసన 'ధృవ', మహేశ్ బాబుతో 'స్పైడర్'లో నటించారు.

# టాప్ లేపుతున్న 'చిరుత' పిల్ల.. నేహా శర్మ గ్లామర్ విందు!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన -చిరుత- చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి తెలుగు ప్రేకకుల మనసు దోచుకున్న భామ నేహా శర్మ. ప్రస్తుతం ఈ -చిరుత- పిల్ల సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ప్రసిద్ధ ఫ్యాషన్ మ్యాగజైన్ -గ్రాజియా- కవర్ పేజీ కోసం శర్మా గాళ్ చేసిన ఫోటోషూట్ నెట్టింట మంటలు పుట్టిస్తోంది. బ్లాక్ థీమ్డ్ డిజైనర్ డ్రెస్సులో నేహా తన అందచందాలను ఆరబోస్తూ ఇంటర్నెట్ షేక్ చేస్తోంది. ఈ కవ్విస్తున్న తీరు చూస్తుంటే శర్మ గాళ్ గ్లామర్ డోస్ గతంలో కంటే ఇప్పుడు పీక్స్‌కు చేరుకుందని అర్థమవుతోంది. చీవX ాఖుఎ ాశ్రీంశీ =ఝుం - హీరోయిన్ ఆస్తి 74 కోట్లు - భర్త ఆస్తి కేవలం 50 లక్షలు! ాఎజవతీఅంవఎవత్ నేహా శర్మ తన సోషల్ మీడియా ఖాతాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు టచ్‌లో ఉంటుంది. అయితే ఇటీవలి కాలంలో వరుస ఫోటోషూట్లతో విపరీతంగా చెలరేగిపోతోంది. ముఖ్యంగా బ్యాక్‌లెస్ ఫోటోలు, చిట్టి పొట్టి నిక్కర్లు, బికినీ వీడియోలతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. గ్రాజియా కవర్ పేజీపై ఆమె కనబరిచిన ముగ్ధమనోహర రూపం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫోటోషూట్‌లో నేహా ఎంతో ఆత్మవిశ్వాసంతో, మునుపెన్నడూ లేని విధంగా తన బోల్డ్ లుక్స్‌తో కట్టిపడేస్తోంది. డైలమాలో స్టార్ డైరెక్టర్లు.. తాజా గ్రాజియా ఫోటోషూట్ కోసం నేహా శర్మ ఎంచుకున్న బ్లాక్ అవుట్‌ఫిట్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. మేకప్ ఆర్టిస్ట్ ప్రియాంక చౌరాసియా.. హెయిర్ స్టైలిస్ట్ కింబర్లీ చు ఆమెను దేవకన్యలా తీర్చిదిద్దగా.. ఫోటోగ్రాఫర్ ఇషాన్ జాకా తన కెమెరాలో ఆ అందాలను అద్భుతంగా బంధించారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు నేహా శర్మ అసలు అదుపు తప్పింది! అంటూ క్రేజీ కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. చిరుత బ్యూటీ అందం -అభినయం రెండూ ఈ ఫోటోషూట్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ాశ్రీంశీ =ఝుం - ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! ఇక నేహా శర్మ కెరీర్ విషయానికి వస్తే.. 2026లో కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై ఇల్లీగల్, 36 డేస్ వంటి వెబ్ సిరీస్‌లతో తన సత్తా చాటిన నేహా.. 2026లో మరిన్ని భారీ ప్రాజెక్టులతో అలరించే వీలుందని తెలుస్తోంది. ముఖ్యంగా పంజాబీలో జస్సీ గిల్‌తో కలిసి సంజోగ్ అనే చిత్రంలో నటిస్తోంది. హిందీలో కూడా కొన్ని ప్రతిష్టాత్మక చిత్రాలతో పాటు.. ఓటీటీలో మరిన్ని క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లు చేయడానికి సిద్ధమవుతోంది. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లలో కూడా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని నేహా భావిస్తోంది. వైవిధ్యమైన పాత్రలు చేస్తూనే.. గ్లామర్ పరంగా తన ఫ్యాన్ బేస్‌ను మరింత పెంచుకుంటోంది. ఏది ఏమైనా తన గ్లామరస్ పోస్టులు, అద్భుతమైన నటనతో నేహా శర్మ 2026లో కూడా ట్రెండింగ్ సెల్రబ్రిటీగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

# ప్రదీప్ రంగనాథన్‌కు 50 కోట్లా



వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు అందించిన హీరోతో సినిమా చేయడానికి నిర్మాతలు ఎగబడడంలో ఆశ్చర్యమేమీ లేదు. వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు అందించిన హీరోతో సినిమా చేయడానికి నిర్మాతలు ఎగబడడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఆ హీరోను లాక్ చేయడం కోసం మార్కెట్ స్థాయిని మించి, కొంచెం ఎక్కువ పారితోషకం ఇవ్వడానికి కూడా ప్రయత్నిస్తారు. అలా అని ఆ హీరో మీద పెట్టగలిగే గరిష్ట బడ్జెట్ మొత్తాన్ని కేవలం పారితోషకం రూపంలో ఇస్తారంటే వినడానికి విడ్డూరంగా అనిపించక మానదు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ.. తమిళ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్‌కు ఏకంగా రూ.50 కోట్లు పారితోషకంగా ఇవ్వబోతోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఇలాగే ఇప్పుడు అందరికీ కామెడీగా తోస్తోంది. ప్రదీప్ ఇప్పటికే మైత్రీ సంస్థలో 'డ్యూడ్' మూవీ చేశాడు. ఆ సినిమా వంద కోట్ల వసూళ్లు రాబట్టింది. కానీ షేర్ రూ.50 కోట్ల లోపే వచ్చింది. సినిమాకు రూ.50 కోట్ల పైగానే ఖర్చయింది. ఆ చిత్రానికి ప్రదీప్ రంగనాథన్ రూ.15 కోట్ల మేర పారితోషకం అందుకున్నాడు. ాశ్రీంశీ =ఝుం - కథలపై బాలయ్య ఫోకస్ మారిందా? ాఎజవతీఅంవఎవత్ అలాంటిది ఇప్పుడు దాని మీద మూడు రెట్ల పారితోషకంతో అతను మైత్రి సంస్థలో సినిమా చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్క్రీన్ ప్లే మాస్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ సీనియర్ దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి.. ప్రదీప్ హీరోగా మైత్రీ సంస్థలో సినిమా చేయడానికి అంగీకారం కుదిరింది. తనకు తమిళంలో విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ.. మరోసారి తెలుగు బేనర్లో, పైగా తెలుగు దర్శకుడితో సినిమా చేయడానికి ప్రదీప్ ఒప్పుకోవడం విశేషమే. ఈ చిత్రానికి 'డ్యూడ్' కంటే ఎక్కువ పారితోషకం తీసుకుంటే ఆశ్చర్యమేమీ లేదు. మహా అయితే రూ.20-25 కోట్ల మధ్య రెమ్యూనరేషన్ తీసుకుంటాడేమో-రామాయణం- కోసం రణబీర్ భారీ ప్రయోగం! కానీ ఏకంగా రూ.50 కోట్లు అని తమిళ మీడియా జనాలు రిపోర్ట్ చేస్తుండడమే విడ్డూరం. పేరున్న తమిళ పీఆర్, క్రిటిక్ హ్యాండిల్స్ అన్నీ ప్రదీప్ రెమ్యూనరేషన్ గురించి టెంప్లేట్ ట్వీట్లు వేసేస్తున్నాయి. తమిళ హీరో కోసం తెలుగు నిర్మాతలు వెంపర్లాడుతున్నారనే ఫీలింగ్ తెప్పించడానికే ఈ పని చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కానీ వాస్తవం ఏంటంటే.. తమిళంలో దర్శకులు, నిర్మాతల పనితనం తగ్గిపోవడంతో అక్కడి హీరోలు తెలుగు డైరెక్టర్లు, నిర్మాతల వైపు చూస్తున్న మాట వాస్తవం. ఇది గుర్తించకుండా పారితోషకం గురించి ఇలా ఫేక్ వార్తలు సృష్టించడమే విచిత్రం.

# ధురంధర్ తర్వాత రామాయణ.. మరి వారణాసి



బాలీవుడ్ లో రెండు పార్టుల సినిమాల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంటోంది. రీసెంట్ గా విడుదలైన ధురంధర్ సినిమా రెండు పార్టులుగా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది.

బాలీవుడ్ లో రెండు పార్టుల సినిమాల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంటోంది. రీసెంట్ గా విడుదలైన ధురంధర్ సినిమా రెండు పార్టులుగా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఆ మూవీ రెండు భాగాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు కలెక్షన్ల పరంగా కూడా రికార్డులు సృష్టించాయి. దీంతో పెద్ద కథలను రెండు భాగాలుగా తెరకెక్కించే ట్రెండ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. ఇక ఇప్పుడు అందరి దృష్టి బాలీవుడ్ లో తెరకెక్కుతున్న భారీ పౌరాణిక చిత్రం రామాయణపై పడింది. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఆ మూవీ ఇప్పటికే రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మొదటి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ ద్వారా ఆ విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు. ాశ్రీంశీ =ఝుం - కథలపై బాలయ్య ఫోకస్ మారిందా? ాఎజవతీఅంవఎవత్ భారీ బడ్జెట్, అద్భుతమైన విజువల్స్ తో ఆ చిత్రం తెరకెక్కుతున్న నేపథ్యంలో, రెండు భాగాలుగా విడుదల చేయడం సరైన నిర్ణయమని అంతా అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదే వారణాసి సినిమా గురించి. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఆ ప్రాజెక్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ కూడా ఉండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆ సినిమాను కూడా రెండు భాగాలుగా విడుదల చేస్తారా లేదా అనేది ఇంకా క్లారిటీ లేదు. తెలుగు సినీ పరిశ్రమలో సీక్వెల్ ట్రెండ్ ను పాపులర్ చేసిన వ్యక్తి రాజమౌళి. ఆయన తెరకెక్కించిన బాహుబలి సినిమాను రెండు భాగాలుగా విడుదల చేసి సంచలనం సృష్టించారు.- యూనిక్ లుక్: -రామాయణం- కోసం రణబీర్ భారీ ప్రయోగం! ఆ తర్వాత నుంచి పెద్ద కథలు రెండు పార్టులుగా చెప్పే ధోరణి బలపడింది. అయితే రాజమౌళి తన ప్రతి సినిమాను రెండు భాగాలుగా తీస్తారని మాత్రం కాదు. ఉదాహరణకు ఆయన తీసిన ఆర్ఆర్ఆర్ ఒకే భాగంగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. వారణాసి సినిమాపై కూడా ఇదే ప్రశ్న ఎదురవుతుంది. ఆ మూవీని రెండు పార్టులుగా తెరకెక్కించే ఆలోచన ఉందా లేదా అనే దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదు. గతంలో రాజమౌళి ఆ ప్రాజెక్ట్ ను రెండు భాగాలుగా తీసే ఆలోచన లేదని సంకేతాలు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే కథ, విజువల్ స్కేల్ ను బట్టి ఫైనల్ గా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. మొత్తానికి, ధురంధర్ విజయంతో ప్రారంభమైన ఆ చర్చ రామాయణతో మరింత బలపడింది. ఇప్పుడు అందరి చూపు వారణాసిపై ఉంది. అది కూడా రెండు భాగాలుగా వస్తుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్నది తెలుసుకోవాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై శ్రీలీల..

**శ్రీలీల ఎదుగుదల అందరికీ ఒక రాకెట్ దూకుడులా అనిపించవచ్చు, కానీ ఆమె దృష్టిలో ఇది చిన్న చిన్న అడుగులతో మొదలైన ప్రయాణం.**




టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ఇప్పుడు కేవలం సౌత్ ఇండియాకే పరిమితం కాకుండా నేషనల్ లెవల్లో మెరిసిపోతోంది. 'హార్పర్స్ బజార్ ఇండియా' డిజిటల్ కవర్ స్టార్‌గా నిలిచిన ఈ బ్యూటీ, స్టార్ హీరోయిన్‌గా ఇండ్రస్ట్రీ లో తనదైన ముద్ర వేస్తోంది. గ్లామర్ కంటే నిజాయితీతో కూడిన నటనకే తాను ప్రాధాన్యత ఇస్తానని చెబుతున్న శ్రీలీల.. మన ఊరి కథలే ప్రపంచాన్ని మెప్పిస్తాయని నమ్ముతోంది. తాజాగా ఆమె పంచుకున్న తన సినీ ప్రయాణం మరియు భవిష్యత్తు ఆలోచనలు ఇవే..ాశ్రీంశీ =ఝుం - హీరోయిన్ ఆస్తి 74 కోట్లు - భర్త ఆస్తి కేవలం 50 లక్షలు!ాఎజవతీఅంవఎవత్ స్టార్‌డమ్ వెనుక నిశ్శబ్ద ప్రయాణం: శ్రీలీల ఎదుగుదల అందరికీ ఒక రాకెట్ దూకుడులా అనిపించవచ్చు, కానీ ఆమె దృష్టిలో ఇది చిన్న చిన్న అడుగులతో మొదలైన ప్రయాణం. "ఇది ఒక్కసారిగా వచ్చిన గుర్తింపు కాదు, నిశ్శబ్దంగా వేసిన అడుగులు ఇప్పుడు అందరికీ కనిపిస్తున్నాయి" అని ఆమె అంటోంది. ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకుంటూ, పాతవి వదిలేస్తూ తనను తాను మల్చుకుంటున్నానని తెలిపింది. ఎంత ఎత్తుకు ఎదిగినా తన మూలాలను మర్చిపోకుండా, సామాన్యంగా ఉండటమే తన విజయరహస్యమని ఆమె తెలిపింది.

**- డైలమాలో స్టార్ డైరెక్టర్లు..**

పుష్ప 2' నుంచి బాలీవుడ్ ఎంట్రీ వరకు: శ్రీలీల కెరీర్ ఇప్పుడు పీక్ లో ఉంది. 'పుష్ప 2' లో తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా, తరువాత వచ్చిన 'గుంటూరు కారం'లో కీలక పాత్ర పోషించి మెప్పించింది. ఇక తాజాగా ఈ ఉగాది కి ఉస్తాద్ భగత్ సింగ్ తో అలరించింది. ఇప్పుడు అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్ ఆర్యన్ సరసన బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమైంది. ప్రాంతీయ సరిహద్దులు చెరిగిపోతున్న ఈ సమయంలో, విభిన్న పాత్రల్లో జీవించడం తనకెంతో ఇష్టమని ఆమె అంటోంది. రకరకాల లెన్స్‌ల ద్వారా ప్రపంచాన్ని చూడటం తన ప్రయాణానికి దిక్సూచిగా మారిందని వివరించింది. ఆ నటుడిని ఆకాశానికి ఎత్తేసిన పాకిస్తానీ వైఫ్! మన మూలాలే మన బలం: భారతీయ సినిమా తర్వాతి దశ గురించి శ్రీలీల ఆసక్తికరమైన విషయాలు చెప్పింది. "మన కథలు ఎంత లోకల్‌గా, మన మూలాలకు దగ్గరగా ఉంటే.. అవి అంత గ్లోబల్‌గా ప్రజలకు చేరువవుతాయి" అని ఆమె బలంగా నమ్ముతోంది. మన చిన్న పట్టణాల్లోని కథలు, మన సంస్కృతి, మన గుర్తింపును ప్రపంచ ప్లాట్‌ఫామ్‌పై ఎక్కడా తగ్గకుండా చూపించాలని ఆమె ఆశిస్తోంది. కథలను సింప్లిఫై చేయకుండా, వాటి ఒరిజినల్ కాపాడుతూనే ప్రపంచాన్ని గెలవవచ్చని శ్రీలీల అభిప్రాయపడింది. ాశ్రీంశీ =ఝుం - హీరోయిన్ల రెమ్యూనరేషన్లు తగ్గుతున్నాయా కారణమేంటి వైద్య విద్యార్థి నుంచి గ్లోబల్ స్టార్ వరకు: ఒకవైపు డాక్టర్ విద్యను పూర్తి చేసి, మరోవైపు థియేటర్లను ఊపేసే హీరోయిన్ గా , ఈ రెండు భిన్నమైన పాత్రలను శ్రీలీల బ్యాలెన్స్ చేస్తున్న తీరు అద్భుతం. స్టార్‌డమ్ తలకెక్కించుకోకుండా, నిలకడగా తన లక్ష్యం వైపు దూసుకుపోతోంది. ఇక కేవలం గ్లామర్ హీరోయిన్ కాకుండా, బాధ్యతగల నటిగా గుర్తింపు తెచ్చుకోవాలన్న ఆమె తపన మెచ్చుకోదగ్గది. భవిష్యత్తులో శ్రీలీల మరిన్ని వైవిధ్యమైన కథలతో గ్లోబల్ స్టేజ్ మీద తన జెండా ఎగురవేయాలని ఆశిద్దాం..

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .